www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 024 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శనివారం 09 - 05 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool


గవర్నర్ ను కలిసిన విజయ్... నేడు ఉదయం 11 గంటలకు సీఎంగా ప్రమాణ స్వీకారం!

## అంతర్జాతీయ విద్యాభ్యాసానికి
# పావలా వడ్డీకే రుణాలు

- విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం
- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు
- బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే అన్ని ప్రయోజనాలు వర్తింపు
- సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్ష



**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి - మిగతా 2 లో

## రాయలసీమ ఇక
# రాయల్ సీమ





- సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్ట్
- ఏపీకి రానున్న ప్రముఖ బైక్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్
- తిరుపతి జిల్లా సత్యవేడులో రూ. 2,200 కోట్ల పెట్టుబడి
- 'రాయలసీమ ఇప్పుడు రాయల్ సీమ' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు

**అమరావతి :**
ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తిరుపతి జిల్లాలో సుమారు రూ. 2,200 కోట్ల వ్యయంతో మోటార్‌సైకిళ్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసింది. ఈ శుభవార్తను సీఎం చంద్రబాబు తనదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా - మిగతా 2 లో

## ఇక 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్


2 లో


- ఆలస్యమైతే ఆటో అప్రూవల్!
- రిజిస్ట్రేషన్ల జాప్యంపై చంద్రబాబు ఆదేశాలతో కొత్త విధానం
- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 27 వేల రిజిస్ట్రేషన్లు
- త్వరలో ప్రభుత్వ ఆమోదంతో అమల్లోకి రానున్న కొత్త రూల్

## తెలంగాణ ప్రభుత్వం పలు కులాల పేర్లు మారుస్తూ కీలక నిర్ణయం

2 లో

- కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం
- సామాజిక సంస్కరణల దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు
- దొమ్మర, పిచ్చకుంట్ల తదితర కులాల పేర్ల మార్పు
- మరికొన్ని కులాలకు గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడించిన ప్రభుత్వం

## ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న
# హంటా వైరస్



- ఇది కోవిడ్, ఇన్‌ఫ్లుయెంజా వంటిది కాదు... ఇది వేరే!
- హంటా వైరస్ పై డబ్ల్యూహెచ్‌ఓ
- ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్
- దీని వ్యాప్తి కరోనా వైరస్ కు పూర్తిగా భిన్నమన్న డాక్టర్ మరియా కెర్ఖోవ్
- సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తుల మధ్యే వ్యాపిస్తుందని వెల్లడి

**ఢిల్లీ :**
ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక స్పష్టతనిచ్చింది. ముఖ్యంగా ఇది కోవిడ్-19 తరహాలో మళ్లీ లాక్‌డౌన్‌లకు దారితీస్తుందా? మాస్కులు ధరించాలా? అనే సందేహాలకు నిపుణులు సమాధానమిచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఎపిడెమిక్ అండ్ పాండమిక్ మేనేజ్మెంట్ డైరెక్టర్ - మిగతా 2 లో

## పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం అవుతున్న రంగస్వామి

- పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ఘన విజయం
- 5 స్థానాలకు పరిమితం అయిన డీఎంకే
- 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించిన రంగస్వామి పార్టీ



**పుదుచ్చేరి :**
పుదుచ్చేరి సీఎం రంగస్వామి చరిత్రపుటల్లోలకి ఎక్కబోతున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో, రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. మొత్తం 30 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 16 స్థానాలు అవసరం కాగా, ఎన్డీయే కూటమి 18 స్థానాలను (ఏఐఎన్ఆర్సీ-12, బీజేపీ-4, స్వతంత్రులు-2)
కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్సీ 16 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే 5, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పరిమితం అయ్యాయి.
పుదుచ్చేరి రాజకీయాల్లో అత్యంత సామాన్యుడిగా, మృదుభాషిగా పేరున్న రంగస్వామిని ఎమ్మెల్యేలందరూ తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో, త్వరలోనే ఆయన ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విజయం రంగస్వామి వ్యక్తిగత ఇమేజ్‌కు నిదర్శనం మాత్రమే కాకుండా, పుదుచ్చేరిలో ఎన్డీయే పట్టును మరింత బలోపేతం చేసింది.


## కేరళలో భూమిలోంచి బయటపడిన అరుదైన 'నేల మామిడి'

- కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో అరుదైన 'నీలమాంగ' ఫంగస్ వెలుగులోకి
- చూడటానికి మామిడి పండులా ఉండటంతో దీనికి 'ఎర్త్ మ్యాంగో' అని పేరు
- స్థానికులు దీన్ని సాంప్రదాయ వైద్యంలో పలు రోగాలకు ఉపయోగిస్తారు
- ఇది భూమి లోపల పెరిగే ఫంగస్, శాస్త్రీయ నామం స్క్లెరోటియం స్టిపిటాటం
- ఈ ఆవిష్కరణ ఫంగల్ జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తోన్న వైనం


2 లో

**కేరళ :**
కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో ఓ రైతుకు తన పొలంలో అరుదైన ఫంగస్ జాతి లభ్యమైంది. కరకురుస్సి గ్రామంలో భూమిని సాగు కోసం తవ్వుతుండగా, మామిడి పండ్ల ఆకారంలో ఉన్న సుమారు 20 వింత ఆకృతులు బయటపడ్డాయి. స్థానికంగా 'నీలమాంగ' లేదా 'ఎర్త్ మ్యాంగో' (నేల మామిడి)గా పిలిచే ఈ ఫంగస్ గురించి తెలియగానే శాస్త్రవేత్తలు, జీవవైవిధ్య నిపుణులు ఆసక్తి కనబరిచారు. - మిగతా 2 లో

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన
## డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం


2 లో


- ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!
- హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆంక్షలు
- నేటి అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు

## బీఆర్ఎస్ లిఫ్ట్ విధానం వల్ల రాష్ట్రంపై భారం పడింది


2 లో

- తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- తుమ్మిడిహట్టి ద్వారా గ్రావిటీ ద్వారా నీరు అందించే అవకాశం ఉందన్న జూపల్లి
- దాన్ని పక్కన పెట్టి కాళేశ్వరంను ఎంచుకున్నారని విమర్శ
- మేడిగడ్డ నిరుపయోగంగా మారిందని వ్యాఖ్య

## ప్రతిభ ఆధారంగానే
# ఉద్యోగాలు వస్తాయి



- అడ్డదారులు తొక్కొద్దు
- యువతకు కొండా సురేఖ సూచన
- వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించిన ప్రభుత్వం
- యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్న కొండా సురేఖ
- ఎన్ని ప్రయత్నాలు విఫలమైనా ఉద్యోగ ప్రయత్నాలు ఆపొద్దన్న కడియం కావ్య

**వరంగల్ :**
వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య చేసిన ప్రసంగాలు నిరుద్యోగులకు దిశానిర్దేశం చేశాయి. - మిగతా 2 లో

# దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ తీసుకొస్తున్నాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు తీసుకొస్తున్నాం
- కొడంగల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ
- కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని పిలుపు



**హైదరాబాద్ :**
దేశంలోనే గొప్ప ఆగమ శాస్త్ర సలహాదారులు సుందరవరదాచార్యులని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. సుందరవరదాచార్యులు పేరును కొడంగల్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏదో ఒక ప్రాంగణానికి పెడతామని వెల్లడించారు. తన సొంత నియోజకవర్గంలో పర్యటించిన రేవంత్ రెడ్డి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొడంగల్‌లో రూ.110 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆయన భూమి పూజ చేశారు. రాష్ట్రం గర్వించదగిన గొప్ప కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని రేవంత్ రెడ్డి తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని గుర్తు - మిగతా 2 లో

# సంపాదకీయం

## లక్ష్యాన్ని వదిలేయొద్దు



ప్రపంచంలో ప్రతి గొప్ప ప్రయాణం ఒక చిన్న ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఒక వ్యాపారం, ఒక కంపెనీ, ఒక స్వచ్ఛంద సంస్థ లేదా ఏదైనా ఉద్యమం ఇవన్నీ మొదట ఒక లక్ష్యంతో, ఒక అవసరంతో, ఒక కలతో మొదలవుతాయి. ఆ ప్రారంభంలో ఉండే ఆశయం, సమాజానికి ఉపయోగపడాలనే తపన, ఏదో సాధించాలనే పట్టుదలే ఆ సంస్థకు నిజమైన పునాది. ప్రారంభ దశలో ఎదురయ్యే కష్టాలు మనిషిని మరింత దృఢంగా మారుస్తాయి. కానీ ప్రయాణం ముందుకు సాగేకొద్దీ పరిస్థితులు మారుతాయి. కొత్త వ్యక్తులు పరిచయం అవుతారు. అవకాశాలు పెరుగుతాయి. కొన్నిసార్లు లాభాలు, పేరు, ప్రాధాన్యతలు కూడా మారిపోతాయి. ఈ మార్పుల మధ్య చాలా మంది మొదట ప్రారంభించిన అసలు లక్ష్యాన్ని మర్చిపోతారు. స్వచ్ఛంద సంస్థ ప్రారంభంలో చేసే కార్యక్రమాల వలననే గుర్తింపు వస్తుంది. సంస్థకైనా, వ్యక్తులకైనా అదే మొదటి ముద్ర. ప్రజల మధ్య నమ్మకం, గౌరవం, ఆదరణ కూడా ఆ సేవా కార్యక్రమాల ద్వారానే ఏర్పడతాయి. కానీ చాలా సందర్భాల్లోఁ గుర్తింపు వచ్చిన తర్వాత మొదట ప్రారంభించిన సేవలను, ఆశయాలను, లక్ష్యాలను మరిచిపోతుంటారు. ప్రచారం పెరిగేకొద్దీ సేవ తగ్గిపోవడం, పేరు పెరిగేకొద్దీ బాధ్యత తగ్గిపోవడం, ఇది నేటి సమాజంలో కనిపిస్తున్న బాధాకరమైన నిజం. నిజమైన సేవ అనేది గుర్తింపుకు కాదు.. కానీ ప్రారంభమై గుర్తింపు వచ్చిన తర్వాత ఆగిపోవడం కాదు. ప్రజల అవసరాలు ఉన్నంత వరకు అదే అంకితభావంతో కొనసాగించడమే అసలైన సేవా ధర్మం. ఒక సంస్థ గొప్పతనాన్ని నిర్ణయించేది దాని ప్రారంభ వేడుకలు కాదు కాలం గడిచినా అదే నిబద్ధతతో కొనసాగించే సేవా కార్యక్రమాలే. "ప్రారంభించిన సేవను నిలబెట్టుకోవడంఁ అదే అసలైన సామాజిక బాధ్యత." వ్యాపారం అంటే కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాదు. అది ఒక బాధ్యత. కంపెనీ అంటే కేవలం ఉద్యోగాల కల్పన కాదు; అది ఒక ఆలోచనకు రూపం. స్వచ్ఛంద సంస్థ అంటే కేవలం సేవ కార్యక్రమాలు కాదు;, సమాజంపై ఉన్న బాధ్యతను కార్యరూపంలో చూపించడం. అందుకే ఏ సంస్థ అయినా తన ప్రారంభ ఉద్దేశ్యాన్ని ఎప్పటికీ వదిలేయకూడదు. మార్పులు రావడం సహజం. కాలానికి అనుగుణంగా విధానాలు మారవచ్చు. పని చేసే పద్ధతులు మారవచ్చు. కానీ లక్ష్యం, దృక్పథం మారకూడదు. ఎందుకంటే లక్ష్యాన్ని కోల్పోయిన సంస్థ బయటకు ఎంత పెద్దదిగా కనిపించినా, లోపల ఖాళీగా మారిపోతుంది. చరిత్రలో నిలిచిపోయిన ఎన్నో గొప్ప సంస్థలు తమ మొదటి విలువలను గౌరవించాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాయి. అందుకే అవి కాలంతో పాటు ఎదిగినా, తమ అసలు ఉద్దేశ్యాన్ని మరువలేదు. అదే వాటి విజయ రహస్యం. ఒక వ్యక్తి గానీ, ఒక సంస్థ గానీ ఎత్తులకు ఎదగడం గొప్ప విషయం. కానీ ఎందుకు ప్రారంభించామో గుర్తుంచుకుని ముందుకు సాగడం ఇంకా గొప్ప విషయం. ఎందుకంటే లక్ష్యం ఉన్న ప్రయాణానికి దిశ ఉంటుంది. ఆ దిశే విజయాన్ని నిలబెడుతుంది. కాబట్టిఁ ఎన్ని మార్పులు వచ్చినా, ఎంత ఎదిగినా, ఎంత పేరు సంపాదించినాఁ ప్రారంభించిన లక్ష్యాన్ని ఎప్పటికీ వదిలేయొద్దు.

వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్ & స్కై ఫౌండేషన్ ట్రస్ట్,
9393613555 / 9493613555

## అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు


మొదటిపేజీ తరువాయి - జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.సూపర్ సిక్స్ పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఇప్పటివరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'దీపం 2.0' కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందజేశామన్నారు. మే 19న మత్స్యకారుల కోసం రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. బుడగజంగాలను ఎస్సీలలో చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్రంతో చర్చిస్తామని, కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇది వారి




సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, దీనివల్ల ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు.ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించేలా చొరవ చూపాలన్నారు. భూవివాదాలను పరిష్కరించడంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తుంచుకుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్

మొదటిపేజీ తరువాయి - డాక్టర్ మరియా వాన్ కెర్ఖోవ్ స్పందిస్తూ, హంటా వైరస్ కోవిడ్ లేదా ఇన్‌ఫ్లుయెంజా వంటిది కాదని, దీని వ్యాప్తి విధానం పూర్తిగా భిన్నంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక క్రూయిజ్ షిప్‌లో కనిపిస్తున్న ఈ వైరస్ క్లస్టర్, కేవలం పరిమిత పరిధిలో, సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తుల మధ్య మాత్రమే వ్యాపిస్తోందని తెలిపారు. గతంలో 2018-19లో అర్జెంటీనాలో వచ్చిన 'ఆండీస్ వైరస్' తరహాలోనే ఇది కూడా ఒక పరిమితమైన వ్యాప్తిగానే ఉంటుందని, ఇది పెద్ద మహమ్మారిగా మారే అవకాశం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు.హంటా వైరస్‌కు, కోవిడ్-19కు మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం అవి వ్యాపించే విధానం. కోవిడ్-19 గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి చాలా వేగంగా వ్యాపించే శ్వాసకోశ వైరస్. కానీ, హంటా వైరస్ ప్రధానంగా జూనోటిక్ వ్యాధి (జంతువుల నుంచి మనుషులకు వచ్చేది). ఇది ఎలుకల మూత్రం, మల విసర్జితాలు లేదా లాలాజలం ద్వారా మనుషులకు సోకుతుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ వ్యాప్తి చెందడం చాలా అరుదు. కేవలం 'ఆండీస్ స్ట్రెయిన్' విషయంలో మాత్రమే సన్నిహిత సంబంధాలు ఉన్నవారి మధ్య వ్యాప్తి కనిపిస్తుంది. కోవిడ్ అంత వేగంగా ఇది వ్యాపించదు కాబట్టి, పెద్ద ఎత్తున మహమ్మారిగా మారే ప్రమాదం తక్కువని నిపుణులు చెబుతున్నారు.వ్యాధి సోకిన వారితో కాంటాక్ట్ ట్రేసింగ్, ఐసోలేషన్ వంటి ప్రజారోగ్య చర్యలు పాటించడం ద్వారా ఈ వైరస్ గొలుసును సులభంగా తెంచవచ్చని డాక్టర్ అబ్దిరహ్మాన్ మహమూద్ పేర్కొన్నారు. హంటా వైరస్ కేసుల వారీగా చూస్తే కోవిడ్ కంటే ఎక్కువ ప్రాణాం తకమైనది అయిన ప్పటికీ, అది సమర్థవం తంగా వ్యాపించలేదు కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. ఈ వైరస్ యొక్క ఇంక్యుబేషన్ పీరియడ్ (వైరస్ సోకిన తర్వాత లక్షణాలు బయటపడే సమయం) ఆరు వారాల వరకు ఉండవచ్చని, అందుకే మరికొన్ని కేసులు వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అథానమ్ గెబ్రియేసస్ తెలిపారు.



## కేరళలో భూమిలోంచి బయటపడిన అరుదైన 'నేల మామిడి'


మొదటిపేజీ తరువాయి - శాస్త్రీయంగా దీన్ని 'స్క్లెరోటియం స్టిపిటాటం'గా గుర్తించారు. సాధారణంగా వర్షాకాలంలో పుట్టగొడుగులు భూమి పైకి వస్తాయి. కానీ ఈ 'నేల మామిడి' ఫంగస్ దానికి భిన్నంగా, ఎక్కువ భాగం భూమి లోపలే పెరుగుతుంది. అందుకే దీన్ని గుర్తించడం చాలా కష్టం. ఈ కారణంగానే భారతదేశంలో ఇలాంటి భూగర్భ ఫంగస్‌లపై పెద్దగా అధ్యయనాలు జరగలేదు. దీని ఆకారం మామిడి పండును పోలి ఉండటంతో 'ఎర్త్ మ్యాంగో' అని పిలుస్తున్నా, దీనికి మామిడి పండుతో ఎలాంటి సంబంధం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. చెదపురుగులు ఎక్కువగా ఉండే నేలల్లో ఇది వృద్ధి చెందుతుందని, రుతుపవనాల సమయంలోని తేమ దీని పెరుగుదలకు అనుకూలిస్తుందని భావిస్తున్నారు.స్థానికులు ఈ ఫంగస్‌ను తరతరాలుగా సాంప్రదాయ వైద్యంలో ఉపయోగిస్తున్నారు. దగ్గు,



జలుబు, కడుపు నొప్పి, కామెర్లు, చెవి నొప్పి, శరీర నొప్పులు వంటి సమస్యల నివారణకు దీన్ని వాడతారని చెబుతారు. అయితే, ఈ ఔషధ గుణాలకు సంబంధించి పటిష్ఠమైన శాస్త్రీయ ఆధారాలు ఇంకా లభించాల్సి ఉంది. యాంటీబయాటిక్స్ వంటి ఎన్నో మందులు ఫంగస్‌ల నుంచే ఆవిష్కృతమయ్యాయి కాబట్టి, 'నేల మామిడి'లోని జీవ రసాయన సమ్మేళనాలపై పరిశోధనలు జరపాలని నిపుణులు సూచిస్తున్నారు.ఈ ఆవిష్కరణ భారతదేశంలో ఫంగల్ జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది. పక్షులు, జంతువులతో పోలిస్తే ఫంగస్‌లపై చాలా తక్కువ పరిశోధనలు జరిగాయి. వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు, రసాయనాల వాడకం, పర్యావరణ విధ్వంసం వల్ల ఎన్నో అరుదైన ఫంగస్ జాతులు శాస్త్రీయంగా గుర్తించకముందే అంతరించిపోతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక పర్యావరణ జ్ఞానం ఆధునిక శాస్త్రానికి ఎలా మార్గదర్శకంగా నిలుస్తుందో ఈ సంఘటన తెలియజేస్తోంది.

## తెలంగాణ ప్రభుత్వం పలు కులాల పేర్లు మారుస్తూ కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి - తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర కేబినెట్, జాబితాలోని కొన్ని కులాల పేర్లను మారుస్తూ మరికొన్నింటికి గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడిస్తూ ఆమోద ముద్ర వేసింది. ముఖ్యంగా సమాజంలో పిలిచేందుకు అసభ్యకరంగా లేదా కించపరిచే విధంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి తొలగించి, ఆయా వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారిక రికార్డుల్లో అమల్లోకి రానున్నాయి.బీసీ గ్రూప్-ఏ విభాగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా వరుస సంఖ్య 7లో ఉన్న 'దొమ్మర' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'గడ వంశీయ' అనే పేరును ఖరారు చేసింది. అలాగే వరుస సంఖ్య 18లో ఉన్న 'పిచ్చుకుంట్ల' అనే పదాన్ని మారుస్తూ, ఇకపై వారిని 'వంశ రాజ్'గా వ్యవహరించాలని నిర్ణయించింది. వీటితో పాటు బుడబుక్కల కులానికి 'శివ క్షత్రియ' అనే పదాన్ని, వీరభద్రియ కులానికి వారి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయప దాలుగా జోడించింది. వన్నార్ అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'ధోబీ' అనే పదాన్ని చేర్చడం ద్వారా రజక, చాకలి వర్గాలకు మరింత స్పష్టమైన గుర్తింపును కల్పించింది.అదేవిధంగా బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ముఖ్యంగా ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని రికార్డుల నుంచి పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మార్చింది. దీనివల్ల ఆ వర్గానికి ఒక స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు 'మేరు' అనే పదాన్ని అదనంగా చేర్చింది. ఈ మార్పుల వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం ఉంటుంది, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుందని బీసీ కమిషన్ అభిప్రాయపడింది.



## దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ తీసుకొస్తున్నాం

మొదటిపేజీ తరువాయి - చేశారు. కొండగల్ సమస్యల పరిష్కారం కోసం అందరినీ యాచించే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు ముఖ్యమంత్రి పదవి దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.విద్య, వైద్యం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పేదలకు ఇస్తున్నామని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, కృష్ణా నదీ జలాలతో కొండగల్ భూములు తడవాలని పేర్కొన్నారు. కృష్ణా జలాలు వచ్చే వరకూ మంత్రి దామోదర, శ్రీహరిని నిద్ర పోనీయొద్దని సూచించారు. కొడంగల్‌లో వచ్చిన మార్పులు ప్రజలు గమనించాలని కోరారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గణులు ఉన్నాయని, లగచర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని గుర్తు చేశారు. నాడు రాష్ట్రం నలుదిక్కులకు వెళ్లి చదువుకునే వాళ్లమని, నేడు రాష్ట్రం నలుదిక్కుల నుంచి కొడంగల్‌కు వచ్చి చదువుకుంటున్నారని కొనియాడారు.2034 వరకూ కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని నాయకులకు, ప్రజలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నామని, కోస్గీ నుంచి శంషాబాద్‌కు 300 ఫీట్ల రోడ్ వేసుకుంటున్నామని తెలిపారు. దేశంలో గొప్ప పరిశ్రమలు కొడంగల్‌లో పెట్టే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో పనులు ఏం కావాలో విచారణ చేయాలని, మండలానికి ఒక కమిటీ చొప్పున వేసుకోవాలని సూచించారు. కమిటీలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, పేదల సమస్యలు పరిష్కరించేలా అందరూ కృషి చేయాలని వెల్లడించారు."కొడంగల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం. విద్య, వైద్యం, కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలను పేదలకు ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. కృష్ణా నదీ జలాలతో కొండగల్ భూములు తడవాలి. కృష్ణా జలాలు వచ్చే వరకూ మంత్రి దామోదర, శ్రీహరిని నిద్ర పోనీయొద్దు. కొడంగల్‌లో వచ్చిన మార్పులు ప్రజలు గమనించాలి. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గణులు ఉన్నాయి. లగచర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. నాడు రాష్ట్రం నలుదిక్కులకు వెళ్లి చదువుకునేవాళ్లం. నేడు రాష్ట్రం నలుదిక్కుల నుంచి కొడంగల్‌కు వచ్చి చదువుకుంటున్నారు. 2034



వరకూ కొడంగల్‌లో రాజకీయాలు పక్కకుపెట్టి పని చేద్దాం. దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నాం.కొడంగల్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సీఎం భూమిపూజ చేసిన రేవంత్ రెడ్డి, లగచర్లలో నిర్మించే 430 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దౌల్తాబాద్ వేంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గీలో వేణుగోపాల స్వామి ఆలయం, కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గీ ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భూమిపూజలో మంత్రులు దామోదర రాజనరసింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి

మొదటిపేజీ తరువాయి - యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మత్తుపదార్థాలకు బానిస కావొద్దని కొండా సురేఖ గట్టిగా హెచ్చరించారు. నేటి తరంలో సామాజిక మార్పులు వేగంగా వస్తున్నాయని, యువత నిబద్ధతతో పనిచేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, అడ్డదారులు తొక్కొద్దని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు.నిరుద్యోగ యువతలో ఉండే మానసిక ఒత్తిడిపై ఎంపీ కడియం కావ్య స్పందించారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజూ మనలో మనం యుద్ధం చేసుకుంటూ మనల్ని



మనం మెరుగుపరుచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్ని విఫలయత్నాలు ఎదురైనా ఉద్యోగ ప్రయత్నాలను ఆపకూడదని, కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. "మనం తప్పు చేయనంత కాలం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపాయి.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. కలెక్టర్ సత్యశారదదేవి, ఎమ్మెల్యే నాగరాజు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమం, వరంగల్ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించారు.

## రాయలసీమ ఇక రాయల్ సీమ

మొదటిపేజీ తరువాయి - ప్రకటించారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ రాయలసీమలోకి దూసుకుపోతోంది! రాయలసీమ ఇప్పుడు రాయల్ సీమ" అనే క్యాప్షన్‌తో ఓ బుల్లెట్ బైక్ ఫోటోను ఆయన పంచుకున్నారు. ఈ ట్వీట్ కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది.తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వన్నెలూరు, రాళ్ళకుప్పం గ్రామాల్లో ఈ పరిశ్రమ కోసం ప్రభుత్వం 267 ఎకరాల భూమిని కేటాయించింది. రెండు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఇక 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కేవలం 24 గంటల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానుంది. ఈ మేరకు రవాణా శాఖ రూపొందించిన కొత్త విధానానికి ఈ వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.వాహనాల రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో రవాణా శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 వేల వాహనాలు శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి.కొత్త విధానం ప్రకారం డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్‌ను ఆమోదించాలి. ఫ్యాన్సీ నంబర్లు కోరుకునే వారికి ఈ నిబంధన వర్తించదు. ఒకవేళ అధికారులు గడువులోగా ఆమోదం తెలపడంలో విఫలమైతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్‌కు ఆమోదం తెలుపుతుంది. సెలవు రోజుల్లో కూడా అధికారులు ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.తొలుత శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని డీలర్లకే అప్పగించాలని సీఎం సూచించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రావొచ్చని అధికారులు వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్ అధికారాన్ని రవాణా శాఖ వద్దే ఉంచి, 24 గంటల కాలపరిమితితో కూడిన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ దస్త్రం ప్రభుత్వ ఆమోదం పొందగానే కొత్త విధానం అమల్లోకి రానుంది.

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన

మొదటిపేజీ తరువాయి - మే 10 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## బీఆర్ఎస్ లిఫ్ట్ విధానం వల్ల రాష్ట్రంపై భారం పడింది

మొదటిపేజీ తరువాయి - కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన సాగునీటి విధానాలపై విమర్శలు గుప్పించారు. సహజసిద్ధమైన ప్రవాహం (గ్రావిటీ) ద్వారా నీటిని అందించే అవకాశమున్న తుమ్మిడిహట్టిని పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఖర్చుతో కూడిన 'లిఫ్ట్' విధానాన్ని ఎంచుకోవడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని ఆయన మండిపడ్డారు.2008లో వైసీపీ హయాంలో 16 లక్షల ఎకరాల



లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును కాళేశ్వరం పేరుతో రీ-డిజైన్ చేయడం వల్ల సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ప్రాంతాల రైతులకు అన్యాయం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తుమ్మిడిహట్టిని పూర్తి చేయడానికి సిద్ధంగా ఉందని జూపల్లి స్పష్టం చేశారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తామని, దీనివల్ల పొరుగు రాష్ట్రంలో ముంపు సమస్య ఉండదని ఆయన వివరించారు.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎన్డీఏ కూటమి నాయకులు




**గోకవరం,మే08.అక్షర టైమ్స్:–** గోకవరం తహసీల్దార్ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో గోకవరం మండలం గుమ్మల దొడ్డి గ్రామంలో శుక్రవారం ఉదయం రైతులకు భూమి హక్కు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది గత ప్రభుత్వంలో ఆందోళనకు గురైన రైతులకు భరోసాని కల్పిస్తూ రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు పూర్తి హక్కును కల్పిస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు తయారుచేసి పంపిణీ చేస్తుంది ఇందులో భాగంగా గుమ్మల దొడ్డిలో పాస్ పుస్తకాలు పంపిణీ జరిగింది ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ సత్తి వెంకటరెడ్డి, స్థానిక బిజెపి సీనియర్ నాయకుడు ఏగి సాంబశివ, ఏగి దుర్గాదేవి, టిడిపి మండల కన్వీనర్ పిల్ల చంటిబాబు, టిడిపి నాయకులు అడపా భరత్ బాబు, ఉంగరాల రాము, ప్రశాంత్ కుమార్ హలో నెన్ కన్నబాబు, గాజింగం సత్తిబాబు,కోట పెద్ద సూరిబాబు, మండిగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు





గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా


## పదవ తరగతి ఫలితాల్లో సంపత్ నగరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం

### - అభినందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**రాజానగరం,మే08.అక్షర టైమ్స్:–**ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో రాజానగరం మండలం, సంపత్ నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వారిలో చెల్లూరి నాగ సూర్య చంద్రకళ సాయి: 581 మార్కులు, పెమ్మనబోయిన చరణ్ కుమార్: 556 మార్కులు, మద్దూరి వీర నాగలక్ష్మి: 555 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. విద్యార్థుల అసాధారణ ప్రతిభను తెలుసుకున్న రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. "కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన



ఈ విద్యార్థులు యువతకు స్ఫూర్తిదాయకం. విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు నా ప్రత్యేక అభినందనలు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రస్థాయిలో పేరు తీసుకురావాలి.ఈ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ ఎమ్మెల్యే అభినందించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.




## స్వచ్ఛ సర్వేక్షణ్ కాకినాడకు మొదటి ర్యాంకు సాధించడమే లక్ష్యం



**కాకినాడ,మే08.అక్షర టైమ్స్:–**స్వచ్ఛ సర్వేక్షణ్ కాకినాడకు మొదటి ర్యాంకు సాధించడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.శుక్రవారం ఆయన ఎల్విన్ పేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీ కోసం ప్రజలు సహకరించాలని కోరారు.

## అర్జీల పరిష్కారమే లక్ష్యం : కాకినాడ కమిషనర్




**కాకినాడ,మే08.అక్షర టైమ్స్:–**పీజీఆర్ఎస్కు వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రతి అర్జీని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీఎం దీనిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## చర్లపల్లి కాంగ్రెస్‌లో పదవుల కలకలం

### - సీనియర్లకే ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్

**చర్లపల్లి,మే08.అక్షర టైమ్స్:–**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ కమిటీలో పదవుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలను పక్కనపెట్టి, కొందరు తమ అనుచర వర్గానికే పదవులు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చర్లపల్లి డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కలిసి తమ అభ్యంతరాలను వెల్లడించారు. పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ సూచనల మేరకు కనీసం మూడు సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికే ముఖ్య పదవులు ఇవ్వాలని వారు కోరారు.



అయితే చర్లపల్లిలో ఆ మార్గదర్శకాలు అమలు కావడం లేదని, కొందరి వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారని నాయకులు విమర్శించారు.సీనియర్ నేతల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, పార్టీ ఆదేశాల ప్రకారమే నిజాయితీగా పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారిని కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో గడ్డం యాదగిరి, బూడిద శ్రావణ్ కుమార్ గౌడ్, మన్మోహన్ రెడ్డి, పుల్లపు మల్లేష్, ప్రేమ్ కుమార్ గౌడ్, వంశీ రాజ్, కెవిఎల్ఎన్ రావు, లతీఫ్, సర్ఫరాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పర్యటనను అడ్డుకుంటాం - నిరుద్యోగుల ఆగ్రహమే కారణం

### ఏఐవైఎఫ్

**కాప్రా,మే08.అక్షర టైమ్స్:–**కేంద్ర ప్రభుత్వ నిరుద్యోగ వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు నిరసనగా మే 10న తెలంగాణకు రానున్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను అడ్డుకుంటామని అఖిలభారత యువజన సమైక్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్ హెచ్చరించారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ యువతకు కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైల్వే నియామక మండలి పరీక్షల ఫలితాలను సంవత్సరాలుగా విడుదల చేయకుండా లక్షలాది మంది అభ్యర్థులను నిరీక్షణలో ఉంచడం అన్యాయమని మండిపడ్డారు. నాన్ టెక్నికల్ విభాగాలు, గ్రూప్–డి, జూనియర్ ఇంజనీర్, సాంకేతిక విభాగాల నియామకాల ఫలితాలు పెండింగ్‌లో ఉండటంతో యువత తీవ్ర నిరాశకు గురవుతోందన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగాల కోత నిర్ణయాన్ని రద్దు చేయాలని, పెండింగ్ ఫలితాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానాన్ని నిలిపివేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రైల్వే శాఖను




ప్రైవేటీకరణ నుంచి కాపాడాలని, లేకపోతే యువతతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.తెలంగాణ విభజన హామీలు అమలు చేయకపోవడం, రాష్ట్రానికి రావలసిన నిధులు కేటాయించకపోవడంపై ప్రజలు, నిరుద్యోగులు మోడీ పర్యటన సందర్భంగా తమ నిరసనను వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బిగ్, జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, నాయకులు సురేష్, అర్జున్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ "శ్రీ కారం క్లబ్" కాకినాడ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం





**కాకినాడ, మే08. అక్షర టైమ్స్:–** కాకినాడలో శుక్రవారం ఉదయం లైన్స్ క్లబ్ "శ్రీకారం క్లబ్" మజ్జిగ చలి వేంద్రాన్ని ప్రారంభించింది. నూతన బైపాస్ సెంటర్ లో ఈ ఏర్పాట్లు జరిగాయి.వేసవి కాలంలో తీవ్రమైన ఎండల నుండి ప్రజలను రక్షించడానికి, ముఖ్యంగా బాటసారుల దాహాన్ని తీర్చి వారికి ఉపశమనం కలిగించడానికి మజ్జిగ చలివేంద్రాలు అత్యవసరం అని శ్రీకారం క్లబ్ మెంబర్ ఉమాదేవి అన్నారు.అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే వడదెబ్బ (ఎమఫ్ హ్ౌతీశీనివ) నుండి మజ్జిగ రక్షిస్తుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను వెంటనే తగ్గిస్తుంది అని ప్రెశిడెంట్ వినీత రెడ్డి అన్నారు.అలసిపోయిన బాటసారులకు, దప్పికతో ఇబ్బంది పడేవారికి చల్లటి మజ్జిగ తక్షణ శక్తిని మరియు సాంత్వనను ఇస్తుంది.. మజ్జిగలో నీరు, లవణాలు, మరియు శరీరానికి అవసరమైన పోషకాలు ఉంటాయి, ఇవి వేసవిలో డిహైడ్రేషన్ (ఐవష్ట్రఎనతీఫ్అశీఅ) కాకుండా చూస్తాయి అని మెట్టా రాధ అన్నారు. భాస్కర్ రెడ్డి ,సురేందర్ రెడ్డి గండేటి. శాస్త్రజీలు పాల్గొన్నారు. ఈ లాంటి సేవా కార్యక్రమా లు అభినందించ తగినవని డెక్టర్ సుభాష్ చంద్ర కొనిమాడారు.నేటి నుండి నెల రోజులు మజ్జిగ చలివేంద్రం కొనసాగడం పార్షదాయకమని మజ్జిగ త్రాగి సేద దీరిన వారన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రాజిరెడ్డి సేవలు

### - బండారు రాజిరెడ్డి సాధనకు కట్టుబడి పనిచేస్తాం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కాప్రా,మే08.అక్షర టైమ్స్:–**ఉప్పల్ మాజీ శాసనసభ్యులు దివంగత బండారి రాజిరెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా రాధిక చౌరస్తాలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాజిరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాజిరెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికే తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని కొనియాడారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వామ్యం అవుతూ అందరికీ అందుబాటులో ఉండే ప్రజానాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సాధారణ ప్రజల సమస్యల పరిష్కారంలో రాజిరెడ్డి చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని ఎమ్మెల్యే అన్నారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శిరీష సోమశేఖర్



రెడ్డి, కొత్త రామారావు, రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, బండారి నీలం రెడ్డి, మహిపాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ పటేల్, మనెమ్మ, కుమారస్వామి, ఎస్.ఏ. రహీమ్, కైప శిరీష రెడ్డి, బేతల బాలరాజు, సత్తమ్మ, తిరుమలయ్య, కృష్ణ, భాస్కర్, భద్రయ్య, సాయిరెడ్డి, చిన్నారావు, నాగపురి రాజు, మల్లేష్, పిట్టల రాజు, సంభాశివ రెడ్డి, సదాశివచారి, కాలనీ సంక్షేమ నాయకులు రాములు, యాదగిరి, పెంటయ్య గౌడ్, బండేగౌడ, మోహన్ తదితరులు పాల్గొని రాజిరెడ్డి సేవలను స్మరించుకున్నారు.



అక్షర టైమ్స్

## మహిళా సాధికారతకు మరొక ముందడుగు

### - నాగారంలో ఉపాధి కేంద్రం ప్రారంభం





**నాగారం,మే08.అక్షర టైమ్స్:**–మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తూ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోలింగ్‌పాలిషింగ్ కేంద్రాన్ని డిప్యూటీ కమిషనర్ ఏ. వాణి గురువారం ప్రారంభించారు. ఎస్‌ఎల్‌ఎఫ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఈ ఉపాధి కేంద్రం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ సామాజికాభివృద్ధి ప్రాజెక్టు అధికారి కె. సురేష్ మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ప్రతిభను వినియోగించుకొని చిన్న స్థాయి పరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి పొందేలా ఇటువంటి కేంద్రాలు దోహదపడతాయని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా మహిళలకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, స్థానికంగా ఉపాధి కల్పనకు ఇది ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ఆశా కార్యకర్తల ఆవేదన.. పెండింగ్ పారితోషకాలు వెంటనే చెల్లించాలని వినతిపత్రం



**కుషాయిగూడ,మే08.అక్షర టైమ్స్:–** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కుషాయిగూడ వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే నెలల పారితోషకాలు ఇప్పటికీ అందక ఆశా కార్యకర్తలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకాలంలో కుటుంబ అవసరాలు, పెళ్లిళ్లు, ఇతర ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పారితోషకాలు అందక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నెలవారీ రుణ వాయిదాలు కూడా చెల్లించలేక అనేక మంది ఆశా కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల మంది ఆశా కార్యకర్తలు రెండు దశాబ్దాలుగా గ్రామీణ పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ ఇప్పటికీ చట్టబద్ధ హక్కులు, స్థిర వేతనాలు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పారితోషకాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కనీసం రూ.18 వేల స్థిర వేతనం అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలైన బీమా, విరమణ ప్రయోజనాలు, వైద్య సేవల భత్యాలు, వివిధ బకాయిలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. ఆశా కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జరిగిన ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ప్రాంతానికి చెందిన ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయం

### పావని మహిపాల్ రెడ్డి





**కాప్రా,మే08.అక్షర టైమ్స్:–** ఉప్పల్ మాజీ శాసనసభ్యులు, ప్రజాహిత నాయకుడు స్వర్గీయ రాజిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కమలానగర్ కాలనీ సంఘ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు పజ్జూరి పావని మహిపాల్ రెడ్డి పాల్గొని రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పజ్జూరి పావని మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాజిరెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికే తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని కొనియాడారు. అధికారంలో ఉన్నప్పటికీ నిరాడంబర జీవనశైలిని కొనసాగిస్తూ సామాన్య ప్రజలతో మమేకమైన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని తెలిపారు. పేదలు, కార్మికులు, బలహీన వర్గాల అభ్యున్నతికై రాజిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న నాయకుడిగా రాజిరెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని, ఆయన చూపిన సేవామార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పావని మహిపాల్ రెడ్డి అన్నారు. రాజిరెడ్డి ఆశయ సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కట్టుబడి పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కమలానగర్ కాలనీ సంఘ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

# సమాజ సేవకు జాతీయ స్థాయిలో గుర్తింపు

### రజిత నాయక్‌కు సేవా రత్న పురస్కారం







**కీసర,మే08.అక్షర టైమ్స్:**–మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలతో విశేష గుర్తింపు పొందుతున్న ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షురాలు బాదావత్ రజిత నాయక్‌కు జాతీయ సేవా రత్న అవార్డు లభించడం పట్ల సిఐటియు కీసర మండల కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ రజిత నాయక్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, పేద ఆడబిడ్డల వివాహాలకు తాళిబొట్లు అందజేయడం, అనాథలు వృద్ధులకు సహాయం చేయడం, అత్యవసర సమయాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ముఖ్యంగా యువతలో సేవా భావాన్ని పెంపొందించే దిశగా రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా రంగంలో ఆమె చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా ఏషియా అంతర్జాతీయ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా తిరుపతిలో శ్రీపతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సేవా రత్న అవార్డు అందుకోవడం ఆమె సేవా ప్రస్థానానికి మరో మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా బాదావత్ రజిత నాయక్ మాట్లాడుతూ, తనకు లభించిన ఈ అవార్డులు మరింత బాధ్యతను పెంచాయని తెలిపారు. సమాజంలో పేదలు, అనాథలు, అవసరమైన వారికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు రూపొందించి ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానని వెల్లడించారు.

# ప్రజా సేవలో చిరస్మరణీయుడు బండారి రాజిరెడ్డి






**చర్లపల్లి,మే08.అక్షర టైమ్స్:–** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి చౌరస్తాలో దివంగత ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండారి రాజిరెడ్డి సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన నాయకుడని కొనియాడారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధి, తాగునీరు, రహదారులు, విద్య, పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాజకీయాల్లో విలువలు, ప్రజల పట్ల మమకారం, అందరికీ అందుబాటులో ఉండే స్వభావం వల్లే ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బండారి రాజిరెడ్డి ఆశయ సాధన కోసం తాము కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే వ్యక్తిగా బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్ స్థానికంగా గుర్తింపు పొందారని నాయకులు పేర్కొన్నారు. యువతను సామాజిక సేవా కార్యక్రమాల వైపు తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గడ్డం యాదగిరి, మెట్టు మన్మోహన్ రెడ్డి, మల్లేష్, ఆనంద్ రాజ్ గౌడ్, బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్, వంశీరాజ్, సర్వరాజ్, కడియాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా 'హాఖీఖ' వేడుకలు

### - చిన్నారులను ఆశీర్వదించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**పెన్ పహాడ్,మే08.అక్షర టైమ్స్:–** మండల కేంద్రంలోని మండల కోఆప్షన్ మెంబర్ షేక్ రఫీ నివాసం శుక్రవారం ఒక అద్భుతమైన వేడుకకు వేదికైంది. రఫీ కుమారులు అస్లాం,అన్సర్ల 'హాఖీఖ' వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు మాజీ మంత్రివర్యులు, ప్రస్తుత శాసనసభ సభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయడంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది.జగదీశ్వర్ రెడ్డి రాకతో ఒక్కసారిగా రాజకీయ సందడి నెలకొంది. షేక్ రఫీ కుటుంబ సభ్యులు ఆయనకు గులాబీ పుష్పగుచ్ఛాలతో, ఆత్మీయ ఆలింగనాలతో అపూర్వ స్వాగతం పలికారు. అపార అనుభవం ఉన్న నాయకుడు తమ ఇంటికి రావడం పట్ల రఫీ కుటుంబం హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.వేడుకలో భాగంగా జగదీశ్వర్ రెడ్డి చిన్నారులు అస్లాం, అన్సర్‌లను ఆత్మీయంగా దగ్గరకు తీసుకొని, వారి ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ నిండు మనసుతో ఆశీర్వదించారు. వేడుకలో అగ్రనేత పాల్గొనడం ఆయనకున్న ప్రజాదరణకు, కార్యకర్తలపై ఆయనకున్న ప్రేమకు నిదర్శనంగా నిలిచింది. ముఖ్య నేతల సమక్షం..ఈ అద్భుత ఘట్టంలో ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ నెమ్మది బిక్షం, పిఏసిఎస్ చైర్మన్ వెన్న సీతారాం రెడ్డి, చివ్వెంల మండల అధ్యక్షులు బాషా, మాజీ సర్పంచులు నెమ్మది నగేష్, షేక్ షరీఫ్, బొబ్బయ్య, మండల నాయకులు తూముల ఇంద్రసేనారావు, నెమ్మది కృష్ణ, దాసరి శ్రీను, గోపి, సతీష్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా సామ్రాజ్యంలో అఖిల్ 'రెడ్డి' మార్క్..



### - మిన్నంటిన బర్త్‌డే సంబరాలు!

**పెన్ పహాడ్,మే08.అక్షర టైమ్స్:–** మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో యడవెల్లి సంజీవరెడ్డి ఫౌండేషన్ అధినేత యడవెల్లి అఖిల్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. అఖిల్ రెడ్డి అందుబాటులో లేకపోయినప్పటికీ, ఆయన ఆదేశాల మేరకు ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొని పలు సేవా కార్యక్రమాలతో ఈ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వేదికపై అభిమానులు, ఫౌండేషన్ సభ్యుల మధ్య భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విచ్చేసిన వారందరికీ స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.చదువులో రాణించిన పేద విద్యార్థులకు అండగా ఉండాలనే ఆశయంతో, అఖిల్ రెడ్డి తన సొంత ఖర్చులతో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యా శ్రీ, కావ్య శ్రీ, యాగ్గడి అక్షర, యడవెల్లి వరుణ్ కార్తికేయ, ఆరిఫ్ ఖాన్, కుక్కడపు కార్తీక్‌లకు ఒక్కొక్కరికి 2,016 రూపాయల చొప్పున, అలాగే ఇంటర్మీడియట్‌లో 940 మార్కులు సాధించిన సింగం చందుకి 3,016 రూపాయల నగదు పురస్కారాన్ని అఖిల్ రెడ్డి వ్యక్తిగత నిధులతో ఫౌండేషన్ సభ్యులు అందజేశారు.గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఫౌండేషన్ తరపున స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను గ్రామానికి పంపిణీ చేశారు. పుట్టినరోజు వేళ ఆడంబరాలకు పోకుండా, తన స్వార్జితం నుండి విద్యార్థులకు, గ్రామానికి సాయం అందించిన అఖిల్ రెడ్డి నిర్ణయాన్ని గ్రామస్తులు వేనోళ్ల కొనియాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన డీజే పాటలు, బాణసంచా పేలుళ్లతో పొట్లపహాడ్ వీధులు మారుమోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. "అఖిల్ రెడ్డి గారు తన సొంత ఖర్చులతో విద్యార్థులకు అండగా నిలవడం గొప్ప విషయమని, ఆయన నాయకత్వంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ మేకపోతుల చిన్న లింగయ్య, గంగారపు సురేష్ ఉపసర్పంచ్,యాల్లంల యాదగిరి వార్డు మెంబర్, మేకపోతుల సుందర్, ఎగ్గడి యాదగిరి, మంగమ్మ, సలీం సిద్దు,ఎగ్బాల్,షకీల్, శివాజీ కీత, బోడ సైదులు, జానయ్య గ్రామ ప్రముఖులు, యువత మరియు పెద్ద సంఖ్యలో అఖిల్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించండి

## ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు




**ఒంగోలు,మే 08.అక్షర టైమ్స్:-** ఒంగోలులోని విద్యుత్ భవన్ లో ఏ.పీ.సీ.పీ.డీ.సీ.ఎల్ ఎస్. ఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పరివర్తకాల పనితీరు, స్మార్ట్ మీటర్ల గురించి, విద్యుత్ శాఖ మీద ప్రజల అభిప్రాయం, రానున్న వేసవిలో నిరంతరాయ మరియు నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం తీసుకోవలసిన చర్యలు వాటి ప్రణాళికలు గురించి చర్చించారు. జిఐఎస్ మ్యాపింగ్, డిటిఆర్ మ్యాపింగ్ అన్ని 33 కె.వి ,11 కె.వి ఫీడర్లు మరియు ట్రాన్స్ఫార్మర్కు అనుసంధానమైన సర్వీసుల వివరములు అన్నియు ఆన్లైన్ లో పొందుపరచడం ద్వారా సత్వరమైన వినియోగదారుల సేవలు అందిచబడుటకు తగు ఆదేశాలు ఇవ్వటం జరిగినది. విద్యుత్ కలెక్షన్లు మరియు బకాయిలు మీద సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని అలాగే జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేయడం కోసం ప్రతి ఒక్క విద్యుత్ అధికారి కృషిచేయాలని ఆదేశించారు. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందరికీ అందించాలని దానికోసం ఫీడర్ పెట్రోలింగ్ చేసి లోపాలను సరి చేయాలని తద్వారా ప్రజలకు విద్యుత్ శాఖ పట్ల శాటిస్ఫాక్షన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ లు, డిఈఈ లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.




# పేరుకే జిల్లా - అంతా డొల్ల

## ఉమ్మడి ప్రకాశం జిల్లా డీసీసీ అధ్యక్షులు షేక్ సైదా

**మార్కాపురం,మే 08.అక్షర టైమ్స్:-** మార్కాపురం నూతన జిల్లా ఏర్పడి ఐదు మాసాలు పూర్తికావస్తున్న జిల్లాకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన నేటి వరకు జరగలేదని, వివిధ శాఖల కార్యాలయాలు కూడా ఏర్పాటు కాలేదని, శాంతి భద్రతను కాపాడవలసిన ఎస్పీ పోస్ట్ సైతం ఇప్పటికీ పూర్తి చేయలేదని మార్కాపురం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రెవిన్యూ శాఖలో అనేక ఖాళీలు భర్తీ చేయవలసి ఉందని అలాగే విద్య, వైద్యం, పంచాయతీ రాజ్ శాఖలో కూడా ఇన్చార్జి పాలనలో నడుస్తున్నాయని" పేరుకే మార్కాపూర్ జిల్లా అని అంతా డొల్లని "శుక్రవారం మార్కాపూర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం 65 రోజులు పాటు సుదీర్ఘంగా సాగిన ఉద్యమంతో అన్ని రాజకీయ పక్షాలు ప్రజా సంఘాల నాయకత్వంలో జరిగిన ఉద్యమ ఫలితంగా జిల్లాని సాధించుకున్నామని అయితే! జిల్లా సాధించుకున్నాం అనే ఆనందం ఇప్పుడు మార్కాపురం ప్రాంతంలో జరుగుతున్న భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా, రేషన్ మాఫియా, లిక్కర్ మాఫియా చూసి ఆనందం కాస్త ఆవిరి అయిపోతుంది అని షేక్ సైదా అన్నారు. ప్రతి సోమవారం జరిగే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ మార్కాపురం పట్టణానికి 5 కిలోమీటర్ల



దూరంగా ఉన్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కాకుండా మార్కాపురం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేయమని కలెక్టర్ ని కలిసి కాంగ్రెస్ ప్రతి బృందం విన్నవించి మూడు వారాలు కావస్తున్న ఇప్పటికీ ఆ దిశగా ప్రయత్నించకపోవడం బాధాకరమని ప్రజల సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వం అయితే వెంటనే ఆ విధంగా చర్యలు చేపట్టాలని, అధికారులు, జిల్లా కలెక్టర్, ప్రజల అర్జీదారుల ప్రయోజనం కలిగే విధంగా ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేయాలని సైదా కోరారు. అలాగే ప్రభుత్వ భూములు పేద ప్రజల, ప్రవేట్ భూములు కబ్జాకు గురి కాకుండా, కొండలను పిండి చేసి గ్రావిల్ను తరలించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సైదా డిమాండ్ చేశారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి నిధులు కేటాయించాలని,వట్టి మాటలతో వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాదని నాలుగువేల కోట్ల రూపాయలు ఖర్చు పెడితే తప్ప ప్రాజెక్టు




పూర్తి కాదని నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ఇవ్వగలరని సైదా అన్నారు. జూన్ కి వెలుగొండ ప్రాజెక్ట్ ని పూర్తి చేస్తాం అన్న చంద్రబాబు మాటమీద నిలబడాలని ఇంకా కేవలం నెల మాత్రమే ఉందని ఈ నెల కాలంలో ప్రాజెక్టు పూర్తయ్యేది ఎప్పుడు అని సైదా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు 30 సంవత్సరాల నుంచి ఇదే మాట చెప్పి పశ్చిమ ప్రాంత ప్రజల ను మోసం చేస్తున్నారని సైదా తీవ్రంగా విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ప్రాజెక్టు వెంటనే నిర్మాణం చేపట్టకపోతే ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి తో కలిసి మార్కాపురం కేంద్రంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సైదా అన్నారు. ఈ పాత్రికేయులు సమావేశంలో జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ వలి, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు సామ్యూల్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ షేక్ అల్తాఫ్ బాషా, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో కిషోరి వికాసం కార్యక్రమం



**దొనకొండ,మే 08.అక్షర టైమ్స్:-** దొనకొండ మండలం, అరవల్లిపాడు సెక్టార్, గంగదేవిపల్లి సచివాలయం అంగన్వాడి సెంటర్ నందు శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్. సుభాషిణి ఆధ్వర్యంలో కిషోరి వికాసం ప్రోగ్రాం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం లో భాగంగా సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని మాట్లాడుతూ రక్తహీనత, రక్తంలో ఇనుము లోపం వలన రక్తహీనం వస్తుంది, అలసట తిరగడం లక్షణాలు కనిపిస్తాయి, ఇనుము అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి, విటమిన్ సి ఇనుము శోచనకు ఉపయోగపడుతుంది అని అన్నారు. పాలకూర బెల్లం మాంసం ఉపయోగకరశీ ఈ వయసులోనే వేగవంతమైన పెరుగుదల జరుగుతుంది, సమతుల్య ఆహారం మరియు ప్రోటీన్ అవసరం, రోజు ఆటలు మరియు వ్యాయామం శరీరాన్ని బలపరుస్తాయి, సరైన నిద్ర పరిశుభ్రత చాలా ముఖ్యం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి అని సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని తెలియచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పద్మ, రాణి, పుష్ప, రవణమ్మ, ఆశ, ఏఎన్ఎం పద్మావతి, ఆశ వరలక్ష్మి, మరియు కిషోర బాలికలు పాల్గొనటం జరిగింది.

# రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో మార్కులు సాధించిన శ్రీ వర్ష ను సన్మానించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు,మే08.అక్షరటైమ్స్:-** పదవతరగతి 2026 పబ్లిక్ పరిక్ష ఫలితాలలో గిద్దలూరు పట్టణంలోని వినూత్న విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థిని కె. శ్రీ వర్ష జిల్లా స్థాయిలో మొదటి స్థానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం (597/600) మార్కులు సాధించడం ఎంతో అందదాయకంగా, ఎంతో గర్వకారణంగా ఉందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. శ్రీ వర్ష తల్లిదండ్రులకు, వినూత్న విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ అచ్చుకట్ల ఖాజావలి కి, మరియు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇంకా అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆయన అన్నారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో గిద్దలూరు మండల విద్యాశాఖధికారి -1 నల్లబోతుల అశ్విని కుమార్ పాల్గొని 597/600 మార్కులు సాధించిన కె. శ్రీ వర్ష ను అభినందించారు.

# పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

## పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికిన

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా



మార్కాపురం,మే 08.అక్షర టైమ్స్:-(బ్యూరో, షేక్. కరిముల్లా) : మార్కాపురం జిల్లా, మార్కాపురం పట్టణ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ, వైసీపీ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు, సానుభూతిపరులు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారికి షేక్ సైదా పార్టీ కండువాలను కప్పి పార్టీలో ఆధారంగా ఆహ్వానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ అలీ సారధ్యంలో మార్కాపురం పట్టణానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన షేక్. షేక్ షావలి, డి .నాగరాజు ,షేక్ బడే సుభాని, షేక్ జాకీర్, సయ్యద్ రహమతుల్లా, షేక్ గౌస్ బాషా, పఠాన్ హసన్ భాష, షేక్ గౌస్ బాషా, షేక్ మీరావలి, కే. శేఖర్, నాగరాజు తదితరులు తమ కుటుంబ సమేతంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే అలాగే లౌకిక వ్యవస్థ మన కలగాలంటే ఒక కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని వారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్. ఇమ్రాన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు కే సామ్యూల్, షేక్ అల్తాఫ్, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.






# కురిచేడు లో కిషోరి వికాసం రక్తహీనత అవగాహన కార్యక్రమం




**కురిచేడు,మే 08.అక్షర టైమ్స్:-** **కురిచేడు** - 2 అంగనవాడి కేంద్రంలో శుక్రవారం కిషోరి వికాసం రక్తహీనత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిషోరి బాలికల్లో రక్తహీనత గురించి వివరించడం జరిగింది. నేడు మన విదేశ భవిష్యత్తు కిషోరి బాలికల ఆరోగ్యం పై ఆధారపడి ఉంది, కిషోరి ప్రాయం అనేది శరీర మానసిక మార్పులు వేగంగా జరిగే దశ, ఈ దశలో ఈ సమయంలో బాలికలు ఎదుర్కొనే అది పెద్ద సమస్య రక్తహీనత దశలో, ఈ సమయంలో బాలికలు ఎదుర్కొనే అతి పెద్ద సమస్య రక్తహీనత, రక్తహీనత అంటే హిమోగ్లోబిన్ శాతం ఉండాల్సిన దానికంటే తక్కువగా ఉండటం, దీనివల్ల శరీరం త్వరగా అలసిపోవడం, పని మీద శ్రద్ధ వహించలేకపోవడం, రక్తహీనతకు ప్రధాన కారణం, పోషకాహార లోపం, పరిశుభ్రత, పరిశుభ్రత లోపం, అవగాహన లేకపోవడం, ఐరన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి, పాలకూర, తోటకూర వంటివి గుడ్డు, వేరుశనగ ఉండదు. బెల్లం విటమిన్ సి ఐరన్ పట్టాలంటే నిమ్మ ఉసిరి వంటి విటమిన్ సి ఉండే పండ్లు తినాలి, అలాగే ప్రభుత్వం సహకారం పాఠశాలలో పంపిణీ చేసే ఐరన్ పోలిక్ యాసిడ్ ఐఎఫ్ఎస్సి టాబ్లెట్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత, గోళ్ళను కత్తిరించుకోవడం, భోజనానికి ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు షేక్. ఖాదర్ బి, జే పార్వతి, కె వాణి, సువర్ణ, ఆశా వర్కర్ లు, ఏఎన్ఎం, తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్

**కురిచేడు,మే 08.అక్షర టైమ్స్:-** కురిచేడు మండలం, అలవలపాడు గ్రామం లో శుక్రవారం జరిగిన టిడిపి నాయకులు పోతురాజు చంద్రశేఖర్ - సుధారాణి ల కుమారుని వివాహ శుభ కార్యక్రమానికి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ హాజరై వరుడు నూతన వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమం లో కురిచేడు మండల టిడిపి అధ్యక్షులు పిడతల నెమిలయ్య, నీటిసంగం డిసి అధ్యక్షులు ఉన్నగిరి కోటేశ్వరరావు, అలవలపాడు గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

# వివాహ శుభ కార్యక్రమంలో పాల్గొన్న కడియాల లలిత్ సాగర్



**దర్శి,మే 08.అక్షర టైమ్స్:-** దర్శి మండలం, శేషం వారి పాలెం గ్రామం లో శుక్రవారం జరిగిన టిడిపి నాయకులు శేషం మాలకొండయ్య - రవణమ్మల కుమారుని వివాహ శుభ కార్యక్రమానికి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ హాజరై వరుడు చి॥ నరేష్ బాబు ని ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమం లో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగువేణి - సుబ్బారావు, శేషం వారి పాలెం గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

# వేగంగా 22(ఏ) భూములకు పరిష్కారం!




**ఒంగోలు,మే 08.అక్షర టైమ్స్:-** నిషేధిత 22(ఏ) జాబితాలోని భూముల సమస్యను త్వరగా పరిష్కరించే దిశగా జిల్లా అధికార యంత్రాంగ చర్యలు వేగవంతం చేసింది. తమ భూముల వివరాలు పొరపాటున ఈ జాబితాలో చేరాయని, వీటిని పరిష్కరించాలని మూడు డివిజన్లలో కలిపి జిల్లావ్యాప్తంగా 591 దరఖాస్తులు వచ్చినట్లు డిఆర్ఓ బి.చిన ఓబులేసు తెలిపారు. ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ ద్వారా వీటిని జిల్లా కేంద్రానికి తెప్పిస్తున్నామని చెప్పారు. గురు వారం నాటికి 439 వచ్చినట్లు వివరించారు. వీటిని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ప్రతివారం కలెక్టరేట్ లో తహశీల్దార్ లతో తాను వెరిఫికేషన్ చేయిస్తున్నట్లు చెప్పారు. వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు,మే 08.అక్షర టైమ్స్:-** అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్లో రెండవ రోజు పాల్గొన్న ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు


# వివాహ శుభ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్




**దర్శి,మే08.అక్షర టైమ్స్:-** దర్శి మండలం, నడిమి పల్లి గ్రామం లో శుక్రవారం జరిగిన టిడిపి నాయకులు యర్రగొండ వెంకటేశ్వర్లు - బాల రవణమ్మ ల కుమారుని వివాహ శుభ కార్యక్రమానికి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమం లో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగువేణి - సుబ్బారావు, నడిమి పల్లి గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

అక్షర టైమ్స్

# వైరస్‌లు క్యాన్సర్ కారకాలు



శరీరంలో ఏదైనా భాగంలో కణాల పెరుగుదల అదుపులేకుండా పెరిగి ఇతర భాగాలకు వ్యాపించడాన్ని క్యాన్సర్‌గా పేర్కొంటారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ప్రజల అనారోగ్యానికి, మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారణంగా ఉంటున్నది. ఇప్పుడు ఇతర కారకాలతోపాటు వైరస్‌లు కూడా కొన్ని రకాల క్యాన్సర్లను కలగజేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నట్టు ఆరోగ్య రంగ నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైరస్‌లు క్యాన్సర్‌ను ఎలా కలగజేస్తాయి, వాటిని నిరోధించడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో అవగాహన ఉండాలి. ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే అతి సూక్ష్మ అంటురోగాల కారకాలే వైరస్‌లు. ఇవి బయటి వాతావరణంలో నిర్జీవులుగా ఉంటాయి. ఒకసారి జీవిలో ప్రవేశించాయంటే ఆ జీవి కణాల్లో అభివృద్ధి చెందుతూ జీవ లక్షణాలను ప్రదర్శిస్తాయి. అయితే, కొన్ని రకాల వైరస్‌లు అవి ఆశ్రయించిన (హోస్ట్) జీవి కణాల పనితీరులో కలిసిపోయేలా మార్పుచెందుతాయి. దీనివల్ల కణాల సాధారణ విధుల్లో అవాంతరాలు ఏర్పడతాయి. ఇలాంటి వాటిలో 'ఆంకోజెనిక్' లేదా 'ట్యూమర్ వైరస్‌లు'గా పిలిచే అనేక వైరస్‌లు మనుషుల శరీరంలో క్యాన్సర్ అభివృద్ధికి కారణంగా ఉంటాయి. వీటిలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు (హెచ్‌బీవీ, హెచ్‌సీవీ), లాలాజలం, ఇతర శరీర ఫ్లూయిడ్ల ద్వారా వ్యాపించే 'ఎప్‌స్టీన్ బార్ వైరస్' (ఈబీవీ), హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్ (హెచ్ఐవీ) లాంటివి ప్రసిద్ధి చెందిన క్యాన్సర్ కారక (ఆంకోజెనిక్) వైరస్‌లుగా ఉన్నాయి. ఈ వైరస్‌లు క్యాన్సర్‌కు దారితీసే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కాకపోతే అవి వ్యాపించే విధానం మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. ఉదాహరణకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఆంకోప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది కణం పనితీరు సాఫీగా సాగిపోయే ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. నియంత్రణ లేకుండా కణాలు పెరిగిపోయే క్రమాన్ని ప్రోత్సహిస్తుంది. చివరికి ప్రాణాంతకమైన క్యాన్సర్ అభివృద్ధి చెందడానికి దారితీస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి, సి వైరస్‌లు కూడా దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతాయి. హెపటో సెల్యులర్ కార్సినోమా అనే క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును పెంచుతాయి. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వ్యక్తులలో, హెచ్ఐవీ సోకిన వారిలో వైరస్ సంబంధిత క్యాన్సర్లు అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

### రోగాల భారం...

ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో క్యాన్సర్ ముప్పు వైరల్ ఇన్ఫెక్షన్లతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనాల ప్రకారం సంవత్సరానికి ఇరవై లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు క్యాన్సర్ కారక వైరస్‌లతో (ఆంకోజెనిక్ వైరస్‌లు) సంబంధం కలిగి ఉన్నాయి. దాదాపు 90 శాతం గర్భాశయ క్యాన్సర్లకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), కాలేయ క్యాన్సర్లలో ఎక్కువ భాగం హెపటైటిస్ బి (హెచ్‌బీవీ), హెపటైటిస్ సి (హెచ్‌సీవీ)లు కారణం అవుతున్నాయి. అయితే, వైరస్ ఇన్ఫెక్షన్లు, వాటి కారణంగా క్యాన్సర్లు రాకుండా నివారించడంలో ప్రభుత్వాలు చేపట్టే ప్రజా ఆరోగ్య కార్యక్రమాలే కీలకపాత్ర పోషిస్తాయి.

### నివారణకు బహుళ నమూనా...

వైరస్‌ల వల్ల అభివృద్ధి చెందే క్యాన్సర్లను నిరోధించడానికి ఆయా రకాల వైరస్‌ల వ్యాప్తిని తగ్గించడం, టీకాలు వేయడం, ముందుగానే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం, ఇన్ఫెక్షన్లకు తగిన చికిత్స అందించడం వంటి బహుళ నమూనా (మల్టీ మోడల్) విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

### టీకాలు (వ్యాక్సినేషన్)...

క్యాన్సర్ నివారణలో టీకాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని రుజువైంది. మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌పై పోరాటానికి హెచ్‌పీవీ టీకా సమర్థంగా పనిచేస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి వైరస్‌తో వ్యాపించే కాలేయ క్యాన్సర్ ప్రాబల్యాన్ని తగ్గించడంలో హెపటైటిస్ బి టీకాలు ప్రభావవంతమైన పరిష్కారంగా చెప్పొచ్చు. ప్రజారోగ్య ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా చిన్న వయసులోనే అవసరమైన టీకాలు వేయించుకోవడం, అధిక టీకా రేట్లు నమోదు కావడానికి ప్రభుత్వాలు కృషిచేయాలి.

### స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు...

గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌లు పాప్ స్మియర్ టెస్ట్, హెచ్‌పీవీ పరీక్షలు చేయించుకోవడం వంటివి వైరస్‌లతో వచ్చే క్యాన్సర్లను ముందుగా గుర్తించేందుకు ఉపకరిస్తాయి. ముఖ్యంగా ముప్పు ఎక్కువగా ఉన్న వారి విషయంలో క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. చికిత్సను సులభతరం చేస్తాయి.


### యాంటీవైరల్ థెరపీ...

హెపటైటిస్ బి వైరస్, హెపటైటిస్ సి వైరస్ వంటి దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీవైరల్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటితో వైరస్ స్థాయిలను సమర్థంగా తగ్గించుకోవచ్చు. ఆ విధంగా క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును కూడా తగ్గించవచ్చు. హెపటైటిస్ సి చికిత్సలో ప్రత్యక్షంగా పనిచేసే డైరెక్ట్ యాక్టింగ్ యాంటీవైరల్ ఏజెంట్ల పురోగతి పూర్తి వైరస్ నిర్మూలనకు, క్యాన్సర్ తగ్గడానికి అవకాశం ఇస్తుంది.

### ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు...


వైరస్‌లు, కాన్సర్ల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు తెలియజేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయి. అంటువ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, టీకాల ప్రాముఖ్యం, వ్యాధుల బారినపడటాన్ని తగ్గించడానికి సురక్షిత చర్యలు తీసుకోవడం వంటివి ఈ వ్యాధుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకత పెంపు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇన్ఫెక్షన్లు సులభంగా సోకుతాయి. కాబట్టి ఇమ్యూనిటీ బలహీనంగా ఉన్నవాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా హెచ్ఐవీ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ఉన్న సమూహాలు ఎదుర్కొనే ముప్పును తగ్గించడానికి తగిన టీకా కార్యక్రమాలు, స్క్రీనింగ్ చర్యలు దోహదపడతాయి. వైరస్‌లు సాధారణ జలుబు మొదలుకుని క్యాన్సర్ల వ్యాప్తి వరకు ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారకాలుగా ఉంటాయి. ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి వివిధ రంగాల నుంచి సమష్టి కృషి అవసరమవుతుంది. వైరస్ ప్రేరిత, వైరస్ సంబంధిత క్యాన్సర్లను నివారించడంలో టీకాలు, స్క్రీనింగ్, యాంటీవైరల్ థెరపీలు కీలకమైన అంశాలు. ఈ రక్షణ చర్యలపై ప్రభుత్వాలు, ఆరోగ్య రంగ సంస్థలు దృష్టి సారించడం ద్వారా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపర్చుకోవచ్చు. అయితే, వైరస్‌లు, క్యాన్సర్ల మధ్య పరస్పర చర్యలపై అంతర్జాతీయంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. కాబట్టి, క్యాన్సర్లను నివారించే దిశగా ఔషధాలు, చికిత్సలు అభివృద్ధి చేసే దిశగా నిరంతర అధ్యయనం, కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

# గుండెల్ని పిండే కాలుష్యం



భారతీయ నగరాల్లో పెరిగిపోతున్న వాయు కాలుష్యం వల్ల గుండెజబ్బులున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వస్తున్నది. వాయుకాలుష్యం ఇతరులకంటే గుండె జబ్బులున్నవారికి మరింత ప్రాణాంతకమని అమెరికా పరిశోధకులు గుర్తించారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థలతో కలిసి ఇంటర్‌మౌంటెన్ హెల్త్ సంస్థకు చెందిన పరిశోధకులు వాయు కాలుష్యం వల్ల ఆరోగ్య దుష్ప్రభావాలపై అధ్యయనం నిర్వహించారు. క్యూబిక్ మీటర్ గాలిలో 7 నుంచి 20 మైక్రోగ్రాముల కాలుష్య కారకాలు ఉన్న ఢిల్లీ మరికొన్ని నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. గాలి కాలుష్యం 2.5 పీఎం స్థాయిలో ఉన్న ప్రాంతాల్లోని సాధారణ ప్రజలు, గుండె జబ్బుతో బాధపడే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి అధ్యయనం చేశారు. వాయు కాలుష్యం వల్ల గుండె జబ్బు బాధితుల రక్త నమూనాల్లో అనేక అనారోగ్యకారకమైన మార్పులు గుర్తించారు. గుండె జబ్బులు ఉన్నవాళ్ల రక్త నమూనాల్లో ఇన్‌ఫ్లమేటరీ బయోమేకర్స్ (%జజూ27, ×ూ%-18) చాలా ఎక్కువగా ఉన్నాయని తేలింది. గుండె జబ్బులు లేనివాళ్లలో ఏ మార్పూ కనిపించలేదు. హృద్రోగులు వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం చెబుతున్నది. ఎంత జాగ్రత్తగా ఉంటే గుండెకు అంత మంచిది.

# కాళన్న స్ఫూర్తి ఎక్కడ?



'పాలనాధికారం దుర్వినియోగం చేసే/ గుండాలకు నేను ద్రోహినే/ అన్యాయాన్నెదిరించడం/ నా జన్మహక్కు నా విధి' అన్న కాళోజీని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వాన్ని చాటే నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలకూ, ప్రాజెక్టులకు ఇంకా మరెన్నింటికో తెలంగాణ కీర్తి పతాకలు, స్ఫూర్తి ప్రతీకలుగా నిలిచిన మహానుభావుల పేర్లు పెట్టారు. కుమ్రంభీం, జయశంకర్‌సార్, కాళోజీ వంటి తెలంగాణ పోరాట పటిమకు, తెగువకు మారుపేరైన మహోన్నతుల పేర్లను నిత్య స్మరణీయాలుగా మార్చి నిజమైన నివాళి ఘటించారు. ఆ కోవలో రూపుదిద్దుకున్నదే వరంగల్‌లోని కాళో జీ కళాక్షేత్రం.

ఏకశిలా నగరానికి సిగలో పువ్వులా సువిశాలమైన ప్రాంగణంలో మహా సభావేదిక నిర్మాణానికి కేసీఆర్ ప్రణాళికలు వేశారు. ఆ ప్రాంగణంలోనే కాళన్న నిలువెత్తు విగ్రహం చేయించారు. ప్రారంభోత్సవమే తరువాయి అన్న తరుణంలో సర్కారు మారింది. దాదాపుగా పూర్తయిన భవనానికి రంగులు, సున్నాలు వేసి అట్టహాసాలు చేస్తున్నది రేవంత్ ప్రభుత్వం. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండానే ఇదివరక టి సర్కార్ పూర్తిచేసిన రిక్రూట్‌మెంట్‌తో నియామక పత్రాల పంపిణీ పేరిట హంగామా చేసి పేరు కొట్టేయాలని చూసినవాళ్ల నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం? ఇంతకూ కాళోజీ పేరుతో ప్రచారం పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పాలకుల్లో ఆయన స్ఫూర్తి కించిత్తు అయినా ఉన్నదా అనేది అసలు ప్రశ్న. ఏడాది కావస్తున్నా ఒక్కటంటే ఒక్కటి ప్రజానుకూల నిర్ణయం తీసుకున్నారా? ఒక్క మంచిపనికి శ్రీకారం చుట్టారా? అంతదాకా ఎందుకు, ఏ అస్తిత్వం కోసం కాళోజీ లాంటి మహానుభావులు కొట్లాడారో దానినైనా కాపాడుతున్నారా? తెలంగా ణ పాడే గిట్టని పరాయి పాలకుల ముందు మోకరిల్లుతున్నారు. నీటి హక్కులను కాటగలుపుతున్నారు. ఇదంతా చాలదన్నట్టుగా ఆనవాళ్లు చెరిపేస్తామని ఎగిరెగిరి పడుతున్నారు. కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ ఆనవాళ్లలో ఒకటి కాదా? ఆ మాటకు వస్తే తెలంగాణే కేసీఆర్ అతిపెద్ద ఆనవాలుగా చరిత్రలో నిలిచిపోయింది. చెరిపేస్తే చెరిగిపోవడానికి అది నీటిమీది రాతకాదు, సువర్ణాక్షరం. ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయే చేతగాని, అనుభవం లేని పాలకు లు రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నరు. ప్రజాపాలన అంటూ ప్రజాకంట క పాలన తెచ్చారు. ప్రశ్నిస్తే కేసులు అరెస్టులంటూ వేధిస్తూ పోలీసు రాజ్యం చెలాయిస్తున్నారు. కాళోజీ బ్రతికి ఉంటే ఇవన్నీ సహించేవా రా? 'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర పెడతం' అని గర్జించాడు కదా. అంతేకాదు, తన పేరిట నిర్మించిన ప్రాంగణంలోనే పోలీ సు జులుం ప్రదర్శిస్తే ఊరుకునేవారా? 'హింస పాపమని యెంచు దేశమున హిట్లరత్వమింకెన్నాళ్లు?' అని ప్రశ్నించిన కాళోజీ నేడు రాష్ట్రాన్నే జైలుగా మార్చి ఎమర్జెన్సీ తరహా పాలన తెస్తే పోనీలే అని సరిపెట్టుకునేవారా? 'మరిచిపోకుండగ గురుతుంచుకోవాలె.. కాలంబు రాగానె కాటేసి తీరాలె' అని కాళన్న చెప్పింది ఈ తరహా పాలకుల గురించే అన్నది గుర్తుంచుకోవాలి.

# నిజం చెప్పకుంటే అబద్ధమే రాజ్యమేలుతుంది



పోరాటాల గడ్డ మన వరంగల్ ఖిల్లా. తెలంగాణ ఉద్యమ నాదాన్ని శిరస్సుపై మోసి భారతదేశానికి ప్రత్యేక రాష్ట్ర వాంఛను పరిచయం చేసింది మన వరంగల్ జిల్లానే. కాకతీయ రాజులు, సమ్మక్క-సారక్కలు అందించిన వారసత్వంతో%ూ% దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పౌరుషత్వంతో పిడికిలి బిగించి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించిన వరంగల్ జిల్లా ప్రజానీకానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నిన్న వరంగల్ జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకు గాను వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యలకు మనందరం సమాధానం చెప్పకపోతే అన్యాయమే రాజ్యమేలుతుంది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నేలా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ధిక్కార స్వర నినాదంతోటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పడం లో ఎలాంటి సందేహం లేదు. ప్రజల ఐక్యతతో అందిపుచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత ప్రజ్వరిల్లాలని మన వరంగల్ ప్రత్యేక భూమిక పోషించింది. అందులో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలతో త్రినగరాన్ని సుందరీకరించుకున్నాం. ఎన్నో అంతర్జాతీయ పరిశ్రమలను వరంగల్ జిల్లాకు తీసుకువచ్చి, వరంగల్ ఖ్యాతిని ఖండాంతరాలకు పరిచయం చేసిన నేత కేసీఆర్. కానీ, కొందరు మిడిమిడి జ్ఞానంతో వాస్తవాలను, అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, చరిత్ర చెరిగిపోదు కదా? కాకతీయ రాజుల చరిత్రను తిరగరాసేలా.. ముందు తరాలకు భవిష్యత్తు రహదారిని పరిచేందుకు గాను కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి రేగుముళ్లతో ఉన్న పొలాలను పచ్చని మాగాణిగా మలిచారు. నాడు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు ను అణచివేయాలని, రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలని శతవిధాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీ నేడు నీతులు మాట్లాడుతుండటం నీచమైన రాజకీయ చర్యగా భావిస్తున్నా. కాళోజీ నామస్మరణ చేసే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లేదు. నాడు వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భజనలు చేయడం చూస్తుంటే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కాళో జీ నారాయణరావుకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ నేతృత్వంలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగ ల్ జిల్లా ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి పూనుకోవాలని తీర్మానం చేశారు. అనుకున్నదే తడవుగా ప్రత్యేక జీవో ద్వారా నిధులను విడుదల చేసి నిర్మాణ పనుల ను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కరోనా మహమ్మారి కారణంగా నిర్మాణ పనులు కొం చెం ఆలస్యమయ్యాయి. కానీ, కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పుడు చంకలు గుద్దుతూ మేమేదో చేశామన్నట్టు ఊకదంపుడు రాతలతో నిజాలను అబద్ధాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోతుందా? నిజానిజాలేమిటో ప్రజలకూ తెలుసు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకున్నట్టయితే వెలుగులు విరజిమ్మేలా.. కండ్లు మైమరిచేలా దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధే తప్ప.. రాష్ట్రంలో గత ఏడాది కాలం గా జరిగిన అభివృద్ధి శూన్యం అనేది నూటికి నూరుపాళ్లు నిజం. నాటి ప్రభుత్వ ప్రగతి చక్రాలతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యం, పర్యాటకం, సాంస్కృతిక, ఉపాధి అన్నిరంగా ల్లో కేసీఆర్ తనదైన ప్రత్యేక చొరవను చూపించారు. ఒక్క వరంగల్ జిల్లానే కాదు, రాష్ట్రం మొత్తం అభివృద్ధి పథంలో దూసుకుపోయిం ది. కానీ, నేడు రాష్ట్రంలో చీకట్లు అలుముకున్నాయి. దశాబ్ద కాలపు అభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క పచ్చగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా తీరు మారింది. ఇది నేనొక్కదాన్నే చెప్తున్న వాస్తవం కాదు, రాష్ట్ర పరిస్థితిని చూసిన ప్రజలందరూ ముక్తకంఠంతో ఘోషిస్తున్నది. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ జిల్లాకు ప్రాణం పోసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం.

హైదరాబాద్ అభివృద్ధికి ఏ మాత్రం తీసిపోకుండా వరంగల్‌కు అంతే ప్రాధాన్యం కల్పించింది తెలంగాణ తొలి ప్రభుత్వం. అభివృద్ధికి చిరునామాగా మారుస్తూ జాతీయ కంపెనీ మెగా టెక్స్‌టైల్ పార్కును సైతం తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిది. అభివృద్ధి పథాన దూసుకువెళ్తున్న తెలంగాణను అణగదొక్కాలని నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు ఆంధ్రా తొత్తులతో కలిసి కుట్రలు చేసిన విషయం తెలంగాణలోని ప్రతీ పౌరునికి తెలుసు. ఆ కుట్రలను ఛేదించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రత్యేక ఖ్యాతిని గడించి యావత్ ప్రపంచాన్ని మనవైపు తిప్పుకునేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. నిరంత రం అభివృద్ధి మంత్రంతో, సంక్షేమ పథకాల తో, ప్రజారంజకమైన పరిపాలనను అంది స్తూ.. సబ్బండ వర్గాలను గుండెకు హత్తుకున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ప్రాంత బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలతో దేశానికి వన్నె తెస్తే, ఢిల్లీలో తన చితికి కట్టెపుల్ల కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ పీవీ గురించి మాట్లాడటం మరీ విడ్డూరం. జాతీయ రహదారులకు, తెలంగాణ రాష్ట్ర అంతర్గత రోడ్లను అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నే లా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభు త్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకొని అధిష్ఠానానికి చేరవేయడమే తప్ప అంతకుమించిందేమీ ఉండదు. తెలంగాణ రాష్ట్రం నలువైపులా మరింత అభివృద్ధి సాధించాలంటే అదొక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలుసుకో. మణిపూర్ లాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో చూస్తున్నాం. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఢిల్లీకి డబ్బు ల మూటలు అప్పజెప్పడంతోనే ఆ పార్టీకి సరిపోతున్నది. అధికార జులుంతో, పోలీసు బలగాలతో గిరిజన తండాలపై దాడులు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. గిరిజనులు తమ భూములను అప్పనంగా అప్పజెప్పాలని రైతులకు సంకెళ్లతో బేడీ లు వేసి, అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రాక్షస ప్రభుత్వం ఇది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ పోలీసు బలగాలతో చేస్తు న్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిపోవడం ఖాయం.

# చారిత్రక విభాత సంధ్యల..కడపటి యుద్ధం

బండి నారాయణ స్వామి పదార్ధ నియమాలను, భౌతిక పరిమితులను జయించిన సృజనకారుడు. ఇంకేముంది. అలవోకగా తన రెకలు ఆర్చుకొని, ఆ రెకల మీద మనలను (పాఠకులను) కూర్చుండబెట్టి, 16వ శతాబ్దంలోకి తిరోగమించి, విజయనగర సామ్రాజ్యపు రాచరిక వైభవాన్ని.. అకడి జన జాతుల సామూహిక జీవన విశిష్టతను సజీవ దృశ్యంగా కంట చూపారు.కడపటి యుద్ధం నవల అనటం కంటే..620పేజీల ఆదిహిందూ జనజాతుల చారిత్రక దృశ్యకావ్యం అనటం సమంజసం. వీరం, క్రోధం, మోహం, లోభం, శృంగారం, బీభత్సం, భయానక, అద్భుత రసాలు సమ్మిళితమై అద్వితీయమైన రసానుభూతిని కలిగిస్తుంది.రాచరిక చరిత్ర అంతా నెత్తుటి పొద్దుతోనే మొదలవుతుంది. నెత్తుట్లోనే పారాడి పారాడి నెత్తుటి చెమ్మతోనే ముగుస్తుంది. అట్లే.. నెత్తుటి పొద్దుతోనే కడపటి యుద్ధం తొలి పుట మొదలయ్యింది. ఏనుగు అంతటి అళియ రామరాయల వారి కథ నెత్తుటి ముద్దగానే ముగిసిపోతుంది. రాజులు.. కుట్రలు..కత్తులు.. నెత్తుర్లు.. కొత్తేమీ కాదు. కానీ నారాయణ స్వామి తనకే సొంతమైన అద్భుత కాల్పనిక శక్తితో ప్రతిపుటను దృశ్యాల దొంతరగా రూపొందించారు.మహాభారతంలో ఎన్నిరకాల మనస్తత్వాలు గోచరిస్తాయో .. కడపటి యుద్ధ కావ్యంలో అంతకు మించిన వ్యక్తిత్వాలు అనుభవంలోకి వచ్చాయి. హంపణ్ణ యక్షిణి- ప్రేమ సల్లాపం. అలివేలు- శ్రీనివాసరెడ్డి భగ్న ప్రేమ విలాపం.. ఉపపతితో తెలుగుల మాధవుడు రెండవ భార్య కలాపం.. దేవదాసీ రత్నమాల పొందు కోసం కత్తి పట్టిన టిట్టిభశెట్టి వీరత్వం.. బానిస మహిళ కోసం శెట్టి ఉబలాటం. ముస్లిం పాదుషాల మత మర్మం.. గోలొండ సామ్రాట్ ఇబ్రహీం కుతంత్రం.. అళియ రామరాయల వారి రాజసం.. రాజకీయం.. ముస్లిం సైనికుల మతతత్వం.. ఎన్నని చెప్పను నవల నిండా సజీవపాత్రలే. మహాభారత కావ్యం హస్తినాపురం చక్రవర్తులు, రాజులు, సామంతులు, రాణివాసాల పాత్రలకు.. రాచరికపు కొలువు కూటాల మంత్రాంగాలు, కుట్రలు, కుతంత్రాలు, ఎత్తులు, జిత్తులకే పరిమితమైంది. కానీ కడపటి యుద్ధం హంపి నగర రాజ సౌధాలను దాటుకొని పంచమవాడలోకి ప్రవేశించింది. అకడి నుండి తురకవాడకు..అట్లా ఏడు ప్రాకారాల నడుమనున్న ఒకో సామాజిక జన జాతుల సమూహాల జీవన పార్శ్వాన్ని తడిమి చూపించింది. అకలవాడన మద్యం తిత్తుల మైకం.. బానిస స్త్రీల వేలం.. భోగం సానులతో శృంగారం.. దేవదాసీ సౌధం.. అందలి గోడల మీద చిత్రకళా చాతుర్యం.. పోర్చుగీసు వారి వ్యాపారం.. ఎన్నని రాయను. ప్రతి పదసృష్టి ఒక అద్భుతమే. నవల ఆద్యంతం విసుగు, విరామం లేకుండా ఏకబిగిన చదివించింది."కవి కడు స్వతంత్రుడు. స్వతంత్ర వ్యక్తిత్వం వున్నవాడు. అందుకని వాస్తవికతను వాస్తవికతగా చెప్పడు. వాస్తవికతకు వ్యక్తిత్వంతో స్పందించి సృజించడమే కళ అని కవికి తెలుసు" అంటుంది భాగీరథి. ఈమె భోగం సాని కూతురు. అప్పటికి ఆమె గోలొండ యువరాజు ఇబ్రహీం ప్రేయసి. ఈ మాట ముమ్మాటికి ఈ నవల రచయిత బండి నారాయణస్వామి వ్యక్తిత్వమే. చారిత్రక వాస్తవానికి సృజన జోడించి నిష్పక్షగా, నిర్మొహమాటంగా ఎత్తి చూపారు. మతం అప్రజాస్వామికమైనది అని తేల్చి చెప్తారు. అయితే సామాజికంగా, సాంస్కృతికంగా సమాజంలో సమ్మిళితమై ఉన్న మతపార్శ్వాన్ని తృణీకరించలేని నగ్న సత్యాన్ని ప్రతిభావంతమైన పాత్రల ద్వారా ఎత్తిచూపారు.అనేక సజీవ పాత్రల నడుమ నా మనసుకు అద్భుతం.. అబ్బురం అనిపించిన అభినేతలు ఇద్దరు. ఒకరు ఉత్తణ్ణ. ఇంకొకరు నల్లజ్జ. పరస్పర విరుద్ధ స్వభావమున్న పాత్రలు. బండి నారాయణ స్వామి అద్భుత సృష్టికి ప్రతిరూపాలు. ఉత్తణ్ణ.. ఉత్తముడు.. పంచముడు..చర్మకారుడుడ నిర్వికారుడు.. జ్ఞాన సంపన్నుడు.. అన్నిటికీ మించి వీరవైష్ణవ భక్తి ఉద్యమకారుడు. ఈ పంచముని గుడిసెకు సాక్షాత్తు శ్రీరామ చంద్రుడే ఏతెంచి తన భక్తుడు హన్మంతునికి పాదరక్షలు కుట్టడం అనేది అనన్య సామాన్య కల్పన. పంచమున్ని అచంచలమైన దైవిక కొండ అంచున నిలబెట్టిన ప్రయత్నం. ఉత్తణ్ణ పాత్రలో నాకు సాక్షాత్తు బండి నారాయణ స్వామి గారు సాక్షాతరించారు. వారితో నాకు పరిచయ భాగ్యం బహు స్వల్పకాలమే కానీ, నిరాకారి వెర్రి తన్మయం ఏదో స్వామి గారి చుట్టూ ఆవహిస్తుంది అనిపించింది.ఇంకొకరు నల్లజ్జ. నిర్లజ్జకు నిలువెత్తు రూపం.వ్యసనపరుడు..బోగ లాలసుడు.. జ్ఞాన హీనుడు. మహిళా వస్త్రాదు చినపోతి భర్త. వేశ్య ప్రాపాలిక ఇష్ట ప్రియుడు. నల్లప్రజ నాయకుడు. నల్లప్రజ అంటే దొంగల దండు. యుద్ధానికి ముందు రాయలవారు శత్రు రాజ్య గ్రామాల మీద రాయలు ప్రయోగించే లూటీ ముఠా. నల్లజ్జ పాపభీతి, ప్రాణభయం లేని యోధుడు. ఈ మొండి తనమే ఆఖరి నిమిషంలో అతని ప్రాణం నిలిపింది.'అన్నమయ్య మన సంప్రదాయక ఆధ్యాత్మికతకు తన వ్యక్తిగత అనుభూతిని, అనుభవాన్ని జోడిస్తాడు. అతడు మొత్తం 89భిన్న స్వరరాగాలను ప్రయోగించి ఉంటారు' అని అళియ రామరాయల వారు తన ఇష్టసఖి తిరుమలాంబకు వచించిన సందర్భం.. అనంతరం పుణ్య దంపతుల మధ్య సాగిన సాహితీ సంభాషణ నారాయణ స్వామి గారి సాహిత్య జ్ఞానానికి ప్రతిరూపం. దేవుడు.. దెయ్యం.. మత విశ్వాసాలు లేని హంపణ్ణ ఆఖరికి దేవతా విగ్రహాలను రక్షించే బాధ్యతలు మోయటం కొసమెరుపు. హిందూ ఆలయాల విధ్వంసకుడు, ముస్లిం యుద్ధ వీరుడైన రెహమాన్ హంపణ్ణకు తోడు నిలబడటం కథలో మరో ట్విస్టు .గొప్ప చారిత్రక నవలకు జీవం పోసి నడిపించిన ఈ సాహితీ జ్ఞాని కృషి అపురూపం, అద్వితీయం అని చెప్పక తప్పదు.

# "క్రెడిట్ లిమిట్" పెంచుకోవాలనుకుంటున్నారా

**ఈ విషయాలు తెలియకపోతే ఇబ్బందులు తప్పవు!**

**క్రెడిట్ లిమిట్ పెంచుకునేందుకు బ్యాంకులు పర్మిషన్ ఇస్తున్నాయా**

**ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!**




ఇటీవలి కాలంలో క్రెడిట్ కార్డ్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కార్డు వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తున్న దృష్ట్యా చాలా మంది వీటిని వాడుతున్నారు. అయితే దీనిని వినియోగించేవారికి బ్యాంకులు కార్డ్ లిమిట్‌ను పెంచుకునే ఆప్షన్ ఇస్తుంటాయి. క్రెడిట్ కార్డును బాధ్యతాయుతంగా వాడుతున్నందుకు గాను బ్యాంకులు ఇచ్చే ప్రశంసలా దీన్ని భావిస్తుంటారు. బ్యాంకు ఆఫర్ చేసే లిమిట్ పెంచుకోవాలా? తిరస్కరించాలా? అనేది కార్డుదారుని ఇష్టం. ఈ లిమిట్‌ను పెంచుకోవడం వల్ల కొన్ని ప్రయోజనాలతో పాటు కొన్ని ఇబ్బందులూ ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఆ ఇబ్బందులు ఏంటో ఇప్పుడు చూద్దాం.క్రెడిట్ స్కోర్ విషయంలో క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో కీలక పాత్ర పోషిస్తుంది. అంటే క్రెడిట్ కార్డు పరిమితిలో ఎంత శాతం క్రెడిట్‌ను వాడుకున్నామో దాన్నే సీయూఆర్ అంటారు. ఇది 30 శాతం ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తారు. వివరంగా చూస్తే మీ కార్డు లిమిట్ లక్ష రూపాయలు అయితే నెలకు రూ.30 వేలు వాడితే మీ యుటిలైజేషన్ రేషియో 30 శాతం. ఒకవేళ మీ బ్యాంకు ఆ లిమిట్‌ను రూ.2 లక్షలకు పెంచితే.. మీరు అదే రూ.30 వేలు వాడినట్లయితే సీయూఆర్ 15 శాతానికి తగ్గుతుంది. ఇది మీ క్రెడిట్ స్కోర్ పెరగడానికి దోహదపడుతుంది. దీని వల్ల హోమ్‌లోన్ లేదా పర్సనల్ లోన్ కోసం అప్లై చేసే సమయంలో ఈ స్కోరు ఉపయోగపడుతుంది. కాబట్టి జఖ= తక్కువ ఉండేలా చూసుకోవడం ముఖ్యమంటున్నారు.క్రెడిట్ లిమిట్ పెరిగితే స్కోర్‌కు ఎంత ప్రయోజనం ఉంటుందో అంతే ప్రమాదమూ ఉంటుందని నిపుణులు అంటున్నారు. లిమిట్ పెరిగితే ఎక్కువ ఖర్చు చేసే వెసులుబాటూ లభిస్తుంది. దీంతో చాలా మంది ఆలోచించకుండా ఖర్చు చేసేస్తుంటారు. అయితే ఖర్చులపై నియంత్రణ లేకపోతే బకాయిలు పెరిగిపోవడం, వాటిపై వడ్డీ, బిల్లు చెల్లింపుల కోసం కొత్తగా అప్పులు చేయాల్సి రావడం వంటి పరిస్థితులు తలెత్తొచ్చంటున్నారు. స్థాయికి మించి ఖర్చు చేసినప్పుడు పేమెంట్లు మిస్ అయ్యి క్రెడిట్ స్కోర్ పడిపోవడానికి కారణం అవుతుందని.. స్కోరు పెరగాల్సిన చోట మొదటికే మోసం వస్తుందంటున్నారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్త అవసరం అంటున్నారు.టైమ్ టు టైమ్ పేమెంట్లు చేస్తూ, అప్పులు లేకపోయినట్లయితే క్రెడిట్ లిమిట్‌ను పెంచుకోవచ్చంటున్నారు. ఆ మేర క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోను తగ్గించుకోవడంతో పాటు అత్యవసర సమయాల్లోనూ పెరిగిన మొత్తం ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. కనీస పేమెంట్ చెల్లించేవారైతే లిమిట్ పెంపు జోలికెళ్లకపోవడం మంచిదని.. లిమిట్‌కు ఒకే చెప్పే ముందు మీ పేమెంట్స్ అలవాట్లను సరిచేసుకోవాలంటున్నారు.

# అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు.. కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు**

**భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం**

**ప్రారంభ ట్రేడింగ్‌లో 500 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్**

**భగ్గుమన్న ముడి చమురు ధరలు.. భారీగా పెరిగిన బ్రెంట్ క్రూడ్**

**బ్యాంకింగ్, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి.. ఐటీ, ఫార్మాకు లాభాలు**




అమెరికా, ఇరాన్ మధ్య నెల రోజుల కాల్పుల విరమణ ఒప్పందం దెబ్బతినడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీయగా, భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం సెషన్‌లో బెంచ్‌మార్క్ సూచీలు 0.7 శాతం మేర పతనమయ్యాయి.ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా (0.71 శాతం) నష్టపోయి 77,291.72 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరింది. నిఫ్టీ సైతం 168 పాయింట్లు (0.69 శాతం) క్షీణించి 24,158.15 వద్ద ట్రేడ్ అయింది.బ్యాంకింగ్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, మారుతీ సుజుకీ వంటి కీలక షేర్లు నష్టపోయాయి. అయితే, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మాత్రం లాభాలతో ట్రేడయ్యాయి.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ బ్రెంట్ క్రూడ్ ధర 2.82 శాతం పెరిగి బ్యారెల్‌కు 102.89 డాలర్లకు చేరగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 4 శాతం పెరిగి 98.64 డాలర్లకు చేరింది. ఈ ప్రభావంతో ఆసియా మార్కెట్లైన నిక్కీ, హ్యాంగ్‌సెంగ్, కోస్పి కూడా 1% వరకు నష్టపోయాయి. గురువారం రాత్రి అమెరికన్ మార్కెట్లు సైతం నష్టాలతోనే ముగిశాయి.

# అబ్బాయిల కోసం పోస్టాఫీస్ అద్దిరిపోయే పథకాలు

**తక్కువ రిస్క్, పెట్టుబడితో ఎక్కువ లాభాలు!**

**అమ్మాయిలకే కాదు అబ్బాయిలకు సూపర్ స్కీమ్స్**

**ఈ ఐదు పోస్టాఫీస్ పథకాల గురించి తెలుసుకోండి!**




ఏ తల్లిదండ్రులైనా పిల్లలు తమ కన్నా మంచి స్థానంలో ఉండాలని కోరుకుంటారు. చదువుల దగ్గర నుంచి వాళ్లు ఆర్థికంగా స్థిరపడేవరకు అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తారు. అందుకే పిల్లల చిన్నతనం నుంచే వారి పేరు మీద సేవింగ్స్ ప్రారంభిస్తుంటారు. ఈ క్రమంలోనే రిస్క్ లేని, ఆకర్షణీయమైన వడ్డీలు అందించే పోస్టాఫీసులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే పోస్టాఫీస్‌లో కేవలం అమ్మాయిలకు మాత్రమే పథకాలు ఉన్నాయని భావిస్తుంటారు. కానీ మగపిల్లల కోసం కూడా ఎన్నో పథకాలు ఉన్నాయి. ఇంతకీ ఆ పథకాలు ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.1988లో కిసాన్ వికాస్ పత్ర స్కీమ్‌ను ఇండియన్ పోస్టాఫీస్ ప్రారంభించింది. ఇది మగ పిల్లల కోసం ఒక స్వల్పకాలిక పొదుపు పథకం. ఇది తక్కువ ఆదాయంతో పాటు మధ్యతరగతి కుటుంబాలకు సరిపోతుంది.

**మరిన్ని వివరాలు :**

18 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ పథకానికి అర్హులు. మైనర్ అయితే వారి కుటుంబ సభ్యులు స్టార్ట్ చేయవచ్చు.

కనీస పెట్టుబడి రూ.1000 ఉండగా, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టుకోవచ్చు.

మే 2026 నాటికి ఈ పథకంలో వడ్డీ రేటు సంవత్సరానికి 7.9 శాతంగా ఉంది.

ఈ స్కీమ్‌లో పెట్టిన నిధులను ముందుగానే విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఈ స్కీమ్‌ను ఒక పోస్టాఫీసు నుంచి మరో పోస్టాఫీసుకు బదిలీ చేసుకోవచ్చు.

ఈ పథకం మెచ్యురిటీ పీరియడ్ 10 సంవత్సరాల 4 నెలలు. లోన్ తీసుకునే వెసులుబాటు ఉంది.

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్: ఇది తక్కువ రిస్క్ కలిగి ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఉన్న పథకం. పన్ను ప్రయోజనాలతోపాటు చిన్న, మధ్య తరగతి ప్రజలను పొదుపు చేసేలా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం.18 సంవత్సరాలు ఉన్న వారు అర్హులు. అంతకంటే తక్కువ వయసు ఉంటే తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అప్లై చేసుకోవచ్చు.

ఈ పథకంలో మినిమమ్ రూ.1000 పెట్టుబడి పెట్టొచ్చు. గరిష్ఠ పెట్టుబడిపై పరిమితి లేదు.

ఈ పథకంలో వడ్డీరేటు సంవత్సరానికి 7.7 శాతంగా ఉంది.

ఎన్ఎస్‌సీ మెచ్యురిటీ కాలం- 5 సంవత్సరాలు. లాక్ ఇన్ టెన్యూర్-5 సంవత్సరాలు.

ఈ పథకం ద్వారా లక్షన్నర రూపాయల వరకు పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేయవచ్చు.

పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్: మగపిల్లల కోసం పోస్టాఫీస్ అందిస్తున్న మరో పొదుపు స్కీమ్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్. ఇందులో పెట్టుబడి పెడితే స్థిరమైన ఆదాయం పొందొచ్చు. తక్కువ రిస్క్ ఉండటంతో పాటు నెలనెలా డబ్బులు పొందవచ్చు.ఈ పథకంలో కనిష్ఠంగా రూ.1000, గరిష్ఠంగా రూ.9లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. జాయింట్‌గా అయితే 15 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టొచ్చు.

ఈ పథకంలో వడ్డీ రేటు మే 2026 నాటికి 7.4 శాతంగా ఉంది. నెలవారిగా ఇందులో వడ్డీ చెల్లింపులు ఉంటాయి.

మెచ్యూరిటీ కాలం 5 సంవత్సరాలు.

**పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్ పథకం :**

మగపిల్లల కోసం పోస్టాఫీస్ అందిస్తున్న మరొక మంచి పథకం రికరింగ్ డిపాజిట్. బ్యాంక్‌లోని సేవింగ్స్ ఖాతాతో పోలిస్తే ఇది అధిక వడ్డీ రేటును అందించే రికరింగ్ డిపాజిట్ ప్లాన్. ఈ పథకం కింద తల్లిదండ్రులు 5 సంవత్సరాల పాటు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని ఖాతాలో ఆదా చేసుకోవచ్చు.

ఈ పథకం కాలవ్యవధి 5 సంవత్సరాలు. లాక్ ఇన్ పీరియడ్ 3 నెలలు.

కనిష్ఠ పెట్టుబడి రూ.100, గరిష్ఠ పెట్టుబడిపై పరిమితి లేదు.

ఈ స్కీమ్‌లో ప్రస్తుత వడ్డీ రేటు సంవత్సరానికి 6.7శాతంగా ఉంది.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ : ఈ స్కీమ్ పన్నులను ఆదా చేయడానికి బెస్ట్. తక్కువ రిస్క్‌తో ఎక్కువ లాభం పొందవచ్చు. ఇందులోనూ నామినేషన్ సదుపాయం ఉంటుంది. ప్రాఖీ అనేది ఆకర్షణీయమైన వడ్డీ రేటుతో లభించే పెట్టుబడిపై మంచి రాబడిని అందిస్తుంది.

ఈ స్కీమ్‌లో కనిష్ఠంగా రూ.500, గరిష్ఠంగా రూ.1.5లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

15 సంవత్సరాల లాక్ ఇన్ పదవీకాలంతో వస్తుంది.

సమయం ముగిసిన తర్వాత కాల వ్యవధిని మరో 5 ఏళ్లు పొడిగించవచ్చు.

ఈ పథకంలో మైనర్ పేరుతో ఖాతా తెరవవచ్చు.

మూడు సంవత్సరాల తర్వాత లోన్ తీసుకోవచ్చు.

ఈ స్కీమ్‌లో మే 2026 నాటికి వడ్డీ రేటు 7.1%గా ఉంది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80జ ప్రకారం లక్షన్నర రూపాయల వరకు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.

# ఏఐ ఎఫెక్ట్.. 1,100 మంది ఉద్యోగులను తొలగించిన క్లౌడ్‌ఫ్లేర్

**ఏజెంటెక్ ఏఐ యుగానికి సిద్ధమయ్యేందుకే ఈ నిర్ణయమన్న సంస్థ**

**ఇది ఖర్చుల కోత చర్య కాదని స్పష్టం చేసిన యాజమాన్యం**

**గత మూడు నెలల్లో ఏఐ వినియోగం 600 శాతం పెరిగిందని వెల్లడి**

**భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి కోతలు ఉండవని హామీ**

CLOUDFLARE®

ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ సంచలన నిర్ణయం తీసుకుంది. "ఏజెంటెక్ ఏఐ" యుగానికి సిద్ధమయ్యే క్రమంలో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా 1,100 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో 20 శాతానికి సమానం. గురువారం తమ మొదటి త్రైమాసిక ఆదాయ వివరాలు వెల్లడించిన అనంతరం, ఉద్యోగులకు ఈ విషయం తెలియజేసింది.ఇది ఖర్చుల కోత కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఏఐ యుగంలో కంపెనీని పునర్నిర్మించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు క్లౌడ్‌ఫ్లేర్ సహ వ్యవస్థాపకులు మాథ్యూ ప్రిన్స్, మిషెల్ జాట్లిన్ ఉద్యోగులకు పంపిన మెమోలో స్పష్టం చేశారు. గత మూడు నెలల్లోనే కంపెనీలో ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని వారు తెలిపారు. ఇంజినీరింగ్, హెచ్ఆర్, ఫైనాన్స్‌తో సహా అన్ని విభాగాల్లో వేలకొద్దీ ఏఐ ఏజెంట్ సెషన్లు నడుస్తున్నాయని, అందుకే కంపెనీ నిర్మాణాన్ని మార్చాల్సి వస్తోందని వివరించారు.ప్రస్తుతానికి ఈ తొలగింపుల ప్రక్రియ ఒక్కసారికే పరిమితమని, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి కోతలు ఉండవని యాజమాన్యం హామీ ఇచ్చింది. పదే పదే చిన్న కోతలు విధించడం వల్ల ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంటుందని, అందుకే ఒకేసారి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. ఏఐ ఆధారిత ప్రపంచంలో ఒక ఉన్నత స్థాయి కంపెనీ ఎలా పనిచేస్తుందో నిర్వచించడమే తమ లక్ష్యమని తెలిపింది. తొలగించిన ఉద్యోగులకు పరిశ్రమలోనే అత్యుత్తమ ప్యాకేజీ అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం చూస్తున్నారా

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం చూస్తున్నారా**

**ఇకపై డిగ్రీలు కాదు, ఈ స్కిల్స్ ఉంటేనే భారీ ప్యాకేజీలు!**



భారత టెక్ రంగంలో నియామక ప్రక్రియ ఇప్పుడు భారీ మార్పులకు లోనవుతోంది. గతంలోలా పెద్ద సంఖ్యలో డెవలపర్లను తీసుకోవడం కంటే, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులకే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. కేవలం ఉద్యోగుల సంఖ్యను పెంచుకోవడం కాకుండా, నైపుణ్యం ఉన్నవారికే ప్రాధాన్యత ఇచ్చే దిశగా పరిశ్రమ అడుగులు వేస్తోంది. టెక్ మార్కెట్‌లో ఇప్పుడు హై-ఎండ్ స్కిల్స్‌కు విపరీతమైన డిమాండ్ ఉందని తాజా గణాంకాలు చెబుతున్నాయి.మెషిన్ లెర్నింగ్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరిగినట్లు రిక్రూట్‌మెంట్ సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఐటీ దిగ్గజాలు ఇప్పుడు పాత పద్ధతిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పోస్టుల కంటే, ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌ను రూపొందించే నిపుణుల కోసమే ఎక్కువగా వెతుకుతున్నాయి. మారుతున్న ప్రపంచ పోటీకి అనుగుణంగా వ్యాపారాలను తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నాయి.ప్రముఖ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల నివేదికల ప్రకారం.. నిష్ టెక్నాలజీ రోల్స్‌కు డిమాండ్ అమాంతం పెరిగింది. క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో కూడా రికార్డు స్థాయిలో నియామకాలు జరుగుతున్నాయి. ఇప్పుడు కంపెనీలు కేవలం అకడమిక్ డిగ్రీలను మాత్రమే చూడటం లేదు; అభ్యర్థుల దగ్గర ఉన్న ప్రత్యేక సర్టిఫికేషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీనివల్ల డిజిటల్ ప్రాజెక్టుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని కంపెనీలు భావిస్తున్నాయి.ఈ స్పెషలైజ్డ్ రోల్స్ కారణంగా జీతాల ప్యాకేజీలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సాధారణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పోలిస్తే, నైపుణ్యం ఉన్న ఏఐ డెవలపర్లు అత్యధిక వేతనాలు అందుకుంటున్నారు. అనుభవం ఉన్న అభ్యర్థులు కంపెనీలు మారేటప్పుడు భారీగా హైక్ డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్‌లో టెక్నికల్ నైపుణ్యానికి ఉన్న విలువను ఈ ట్రెండ్ స్పష్టం చేస్తోంది.మరోవైపు, ఫ్రెష్ గ్రాడ్యుయేట్లకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో సవాళ్లు ఎదురవుతున్నాయి. గతంతో పోలిస్తే ఐటీ దిగ్గజాలు మాస్ హైరింగ్‌ను (భారీ నియామకాలు) గణనీయంగా తగ్గించేశాయి. కొత్తగా ఉద్యోగాల్లో చేరేవారు కూడా ఆధునిక టూల్స్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని కంపెనీలు ఆశిస్తున్నాయి. స్థిరమైన కెరీర్ కావాలనుకునే విద్యార్థులకు ఇప్పుడు అప్‌స్కిల్లింగ్ (నైపుణ్యాన్ని పెంచుకోవడం) తప్పనిసరిగా మారింది.గిగ్ ఎకానమీ పెరగడం కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషిస్తోంది. ఖరీదైన టెక్నికల్ పనుల కోసం కంపెనీలు ఇప్పుడు ఫ్రీలాన్స్ నిపుణులను నియమించుకుంటున్నాయి. దీనివల్ల కంపెనీలకు దీర్ఘకాలిక ఖర్చులు తగ్గడమే కాకుండా, నిపుణులకు కూడా నచ్చిన ప్రాజెక్టులు చేసే వెసులుబాటు కలుగుతోంది. ఇది అటు కంపెనీలకు, ఇటు నిపుణులకు ఇద్దరికీ లాభదాయకంగా మారుతోంది.తమ ఉద్యోగుల నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రముఖ టెక్ కంపెనీలు అంతర్గత శిక్షణా కార్యక్రమాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఏఐ వల్ల వ్యాపార శైలి మారుతున్న తరుణంలో, ఉద్యోగులు కూడా దానికి తగ్గట్టుగా సిద్ధంగా ఉండాలని కంపెనీలు కోరుకుంటున్నాయి. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకునే వారికే భవిష్యత్తులో మంచి కెరీర్ గ్రోత్ ఉంటుంది. మానవ మేధస్సు, యంత్రాల శక్తి కలిసినప్పుడే అద్భుతాలు జరుగుతాయని పరిశ్రమ భావిస్తోంది.డేటా ఎథిక్స్, గవర్నెన్స్‌పై అవగాహన ఉన్న అభ్యర్థుల కోసం కూడా కంపెనీలు ప్రత్యేకంగా వెతుకుతున్నాయి. ఏఐ వాడకం పెరుగుతున్న కొద్దీ, ఆ వ్యవస్థలు సురక్షితంగా, పక్షపాతం లేకుండా ఉండేలా చూడటం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ విభాగాల్లో పట్టు సాధించిన వారికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉండబోతోంది.ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావం కూడా భారతీయ కంపెనీల నియామకాలపై కనిపిస్తోంది. కంపెనీలు ఇప్పుడు నియామకాల్లో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఉద్యోగుల సంఖ్య కంటే వారి నాణ్యతకే (ఝఖ్ఖీశ్రీఱ్‌ఎ) ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ వ్యూహం భారత టెక్ వ్యవస్థను దీర్ఘకాలంలో మరింత బలోపేతం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. టెక్ రంగంలో కెరీర్ మార్గాలు ఇప్పుడు మునుపెన్నడూ లేనంత వేగంగా మారుతున్నాయి. విజయం సాధించాలంటే కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదు, ప్రత్యేక నైపుణ్యాలు ఉండాల్సిందే. ఏఐ ప్రపంచానికి అనుగుణంగా మారే వారే తదుపరి వృద్ధికి నాయకత్వం వహిస్తారు. ఈ మార్పుల ద్వారా భారత్ ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

# బెంగళూరులో ఆకాశాన్నంటుతున్న లగ్జరీ ఇళ్ల ధరలు... రూ.10 కోట్లకు దక్కేదింతే!

**బెంగళూరులో రూ.10 కోట్లకు లభించే లగ్జరీ స్థలం గతేడాదితో పోలిస్తే 3.5 శాతం తగ్గుదల**

**విలాసవంతమైన ఇళ్ల ధరలు 2025లో 9.4 శాతం పెరిగాయన్న నైట్ ఫ్రాంక్ నివేదిక**

**ప్రపంచ లగ్జరీ సూచీలో బెంగళూరు 32 స్థానాలు ఎగబాకి 8వ ర్యాంక్‌కు చేరిక**

**దేశంలో అత్యంత ఖరీదైన నగరంగా ముంబై, ఆ తర్వాత ఢిల్లీ, బెంగళూరు**



సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన బెంగళూరులో విలాసవంతమైన ఇల్లు కొనాలనుకునేవారికి షాకింగ్ న్యూస్. నగరంలో లగ్జరీ రెసిడెన్షియల్ మార్కెట్ ధరలు ఆకాశాన్నంటడంతో, ఇప్పుడు రూ.10 కోట్లు వెచ్చించినా గతేడాది కంటే తక్కువ విస్తీర్ణంలోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన 'వెల్త్ రిపోర్ట్ 2026' ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది.నివేదిక ప్రకారం, 2025లో బెంగళూరులో విలాసవంతమైన ఇళ్ల ధరలు ఏకంగా 9.4 శాతం పెరిగాయి. దీని ఫలితంగా, ప్రస్తుతం రూ.10 కోట్ల బడ్జెట్‌తో కేవలం 3,843 చదరపు అడుగుల లగ్జరీ నివాసాన్ని మాత్రమే కొనుగోలు చేయగలరు. 2024లో ఇదే మొత్తానికి 3,983 చదరపు అడుగుల స్థలం లభించగా, ఏడాది వ్యవధిలో కొనుగోలు చేయగల స్థలం 3.5 శాతం మేర తగ్గింది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈ తగ్గుదల బెంగళూరులోనే అత్యధికంగా నమోదు కావడం గమనార్హం. ఈ గణనీయమైన వృద్ధితో, ప్రపంచ లగ్జరీ మార్కెట్ల సూచీ అయిన 'ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్'లో బెంగళూరు 32 స్థానాలు ఎగబాకి 8వ ర్యాంక్‌కు చేరింది.ఇక దేశంలోని ఇతర నగరాలను పరిశీలిస్తే, ముంబై అత్యంత ఖరీదైన మార్కెట్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అక్కడ రూ.10 కోట్లకు కేవలం 1,033 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తుంది. ఢిల్లీలో 2,207 చదరపు అడుగులు లభిస్తుంది. అదే హైదరాబాద్‌లో అయితే 5,360 చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంది. రూపాయి విలువ క్షీణతను మించి లగ్జరీ ఆస్తుల ధరలు పెరగడమే ఈ పరిస్థితికి కారణమని నివేదిక విశ్లేషించింది. బలమైన డిమాండ్, ప్రీమియం ప్రాజెక్టుల రాకతో బెంగళూరు మార్కెట్ దూసుకుపోతున్నా, ఐటీ రంగంలో నెలకొన్న ఆందోళనలు భవిష్యత్తులో ఈ సెగ్మెంట్‌పై ప్రభావం చూపవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# బర్త్ డేకి గ్రాండ్‌గా...

అభిమాన హీరో పుట్టినరోజు దగ్గర పడుతోందంటే అభిమానులు ఆ హీరో తాజా చిత్రాల అప్‌డేట్స్‌ని ఆశిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులు అలానే అప్‌డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 20న ఈ హీరో పుట్టినరోజు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ ఆశించేవాటిలో ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఒకటి. బర్త్ డేకి గ్రాండ్‌గా ఒక వీడియోను విడుదల చేయడానికి ఈ టీమ్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ వీడియోలో విజువల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని టాక్. కుమార స్వామి నేపథ్యంలో త్రివిక్రమ్ తెరకెక్కించనున్న ఈ మైథలాజికల్ మూవీకి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఓ వార్త ప్రచారంలో ఉంది. మరి... ప్రచారంలో ఉన్నట్లు వీడియోను విడుదల చేస్తారా? ఆ రోజు టైటిల్‌ని కూడా ప్రకటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమా అంగీకరించాక కుమార స్వామి గురించి తెలుసుకోవడానికి ఎన్టీఆర్ పుస్తకాలు చదువుతున్నారట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు ఎన్టీఆర్. అలాగే 'దేవర' రెండో భాగం కూడా ఉంది.





# హృదయాన్ని కదిలిస్తుంది

హృదయాల్ని స్పృశించే అందమైన భావోద్వేగాలతో 'గోదారి గట్టుపైన' చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ వేసవిలో అందరూ ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా ఇదని అన్నారు చిత్ర కథానాయకుడు సుమంత్ ప్రభాస్. సుభాష్‌చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. మానవ విలువలు ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ సినిమా చూశాక తండ్రీకూతుళ్ల అనుబంధం తాలూకు గాఢత అర్థమవుతుందని, ప్రతీ అమ్మాయి వాళ్ల నాన్నకు ఫోన్‌చేసి 'ఐ లవ్ యూ డాడీ' అని చెబుతుందని సుమంత్ ప్రభాస్ అన్నారు. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రి కథ ఇదని దర్శకుడు సుభాష్‌చంద్ర తెలిపారు. థియేటర్‌లో చూసి ఫీల్ కావాల్సిన సినిమా ఇదని నిర్మాత అభినవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ , అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకుడు. అరవింద్ మాండ్యం నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. 'మనం నిజజీవితంలో చూసే పాత్రలు, సంఘటనలతో కూడిన ప్రేమకథ ఇది. ఈ ప్రేమకథలోని సంఘర్షణ అందరికీ కనెక్టయ్యేలా ఉంటుంది. అందరికీ గుర్తుండిపోయే సినిమా ఇది' అని దర్శకుడు మధుదీప్ నమ్మకం వ్యక్తంచేశారు. ఇంకా నిర్మాత అరవింద్, హీరోహీరోయిన్లు త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, పంపిణీదారుడు ముత్యాల రాందాస్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: రవికుమార్.వి, సంగీతం: ప్రకాశ్ చెరుకూరి, అరుణ్ చిలువేరు, సమర్పణ: సీహెచ్‌వీఎస్ఎన్ బాబ్జీ, నిర్మాణం: లోటస్ క్రియేటివ్ వర్క్స్.

# వినోదాన్ని పంచే 'పురుషః'



పవన్‌కల్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పురుషః'. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల కోటేశ్వర రావు నిర్మాత. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. గురువారం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ..విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుందని అన్నారు. ప్రచార చిత్రాలకు వచ్చిన స్పందన సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచిందని నిర్మాత చెప్పారు. సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్నందిస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com